J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 31 2.1.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



### అసంబద్ధ నిర్ణయాలు, ఆవేశపూరిత ప్రకటనలతో...

# జగన్ తప్పటడుగులు!

- ప్రతిపక్ష పాత్రనూ సమర్ధవంతంగా పోషించలేక ఇక్కట్లు
- కాలేజీలు తీసుకున్న వారిని జైల్లో వేస్తామంటూ వార్నింగులు
- ప్రత్యర్థులను వదిలిపెట్టి పెట్టుబడిదారులని, అధికారులని టార్గెట్ చేస్తున్నారు
- మెడికల్ కాలేజీల విషయంలో సెల్ఫ్‌గోల్

**అవగాహనా లేమి, అసంబద్ధ నిర్ణయాలు, ఆవేశపూరిత ప్రకటనలు, తప్పులు, తప్పటడుగులే ప్రాతిపదికగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్థానం సాగుతోంది. ఈ క్రమంలో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధిని ఆయన తాకట్టుపెడుతున్నారనే విమర్శలు మూటకట్టుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాలనే ప్రతిపక్షంలోనూ కొనసాగిస్తూ, ఆయన మరింతగా నష్టపోతున్నట్లు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.**

రాజకీయాలలో సహనం, సంయమనం, సమయస్ఫూర్తి చాలా అవసరం. ఏ సమయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలి, ఎవరిని ఎప్పుడు ఎక్కడ ఎలా టార్గెట్ చేయాలి, ఏ విషయంపైన ఎలా స్పందించాలి, అధికారంలో ఉంటే ప్రతిపక్ష పార్టీని ఎలా ఇరకాటంలో పెట్టాలి, ప్రతిపక్షంలో ఉంటే అధికార పక్షాన్ని ఎలా ఎదుర్కోవాలి, ఇలాంటివన్నీ రాజకీయాల్లో చాలా కీలకమైన అంశాలు. అయితే, అలాంటి ముఖ్యమైన అంశాలపై సమయానుకూలంగా స్పందించడంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ విఫలమౌతున్నట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఎందుకంటే గతంలో అమరావతి నుంచి మొదలుపెడితే, నేటి మెడికల్ కాలేజీల విషయం వరకు తొలుత ఏదో అనుకుని, చివరికి ఇంకేదో చేస్తూ ఆయన బొక్కబోర్లా పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అమరావతిని చంపేందుకు కుయుక్తులు పన్ని చివరికి గత ఎన్నికల్లో అదురుదెబ్బ తిన్నారు. ఇప్పుడు మెడికల్ కాలేజీల అంశంలో చంద్రబాబును పక్కకు పెట్టి, పీపీపీ విధానంలో కాలేజీలను దక్కించుకున్న వారిని టార్గెట్ చేస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే

2లో

## జిల్లాలో ఆనందం

# గూడూరు.. ఇక నెల్లూరులోనే

### ఆ 3 మండలాలు కూడా!



### వాకాడు, చిట్టమూరు మండలాలు తిరుపతి జిల్లాకి

### ఫలించిన నేతల కృషి

### నెరవేరిన ప్రజల ఆకాంక్ష



**నెల్లూరు నేతల కృషి ఫలించింది. నెల్లూరు జిల్లా వాసుల ఆకాంక్ష నెరవేరింది. గూడూరు ప్రజలు చేసిన ఉద్యమానికి సార్ధకత చేకూరింది. గత ప్రభుత్వం జిల్లాకి చేసిన అన్యాయానికి ఈ ప్రభుత్వంలో న్యాయం జరిగింది. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యామంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబడింది. గూడూరు మళ్ళీ నెల్లూరుకు తిరిగొచ్చేసింది. జిల్లాల పునర్విభజనలో కందుకూరుని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి, గూడురుని మాత్రం తిరుపతి జిల్లాలోనే కొనసాగించాలనుకున్న ప్రభుత్వ నిర్ణయానికి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం దిగొచ్చింది. తాజా నిర్ణయాలతో గూడూరు.. నెల్లూరులో కలవడంతో గూడూరు ప్రజలు 'హమ్మయ్య'..అంటూ ఊపిరి పీల్చుకున్నారు. దాంతోపాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలు కూడా నెల్లూరు జిల్లా పరిధిలోనే ఉంచుతామనే ప్రభుత్వ భరోసాతో..ఆయా ప్రాంతాల ప్రజల్లో ఈసారి సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చినంత సంబరం కలుగుతోంది.**

కూటమి ప్రభుత్వం వచ్చాక అంతా బాగానే ఉందనుకుంటున్న తరుణంలో.. జిల్లాల పునర్విభజన తెరపైకి వచ్చేసరికి నెల్లూరు జిల్లా పరిస్థితి అయోమయంగా మారింది. గూడూరును తిరుపతిజిల్లాలోనే ఉంచేస్తారని, కలువాయి–రాపూరు–సైదాపురం మండలాలను కూడా తిరుపతిలో కలిపేస్తారని

2లో




# జగన్ తప్పటడుగులు!

(మొదటిపేజీ తరువాయి)

వారందరిని అరెస్టు చేస్తామని ప్రకటించి తన ఇమేజ్‌ను మరింత డేమేజ్ చేసుకుంటున్నారు. తద్వారా పెట్టుబడి దారులకు జగన్ వ్యతిరేకి, పారిశ్రామిక వేత్తల పాలిట గుదిబండ అనే పేరును మరింత సార్థకం చేసుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

### తొలి నుంచి తప్పటడుగులే..!

2019–24 మధ్య అతి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాభివృద్ధిని జగన్ గాలికొదిలేశారు. పైగా పరదాల చాటున పర్యటనలు చేస్తూ ప్రజలకు కొద్దికొద్దిగా దూరమయ్యారు. ఫలితంగా ఆయన 2024 ఎన్నికల్లో ఏకంగా 151 నుంచి 11సీట్లకే పరిమితమయ్యారు. కనీసం ప్రధాన ప్రతిపక్షహోదా కూడా దక్కించుకోలేకపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన ప్రతి అంశంపై ఆచితూచి వ్యవహరిస్తూ, ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. అయితే, ప్రతిపక్షం బాధ్యతను గాలికొదిలేసి పలాయన వాదమే పరమావధిగా ఆయన రాజకీయాలు చేస్తుండడం విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత ఒకటిన్నర సంవత్సర కాలాన్నే తీసుకుంటే, అధికారం కోల్పోయిన తర్వాత కేవలం ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారానికి మాత్రమే వైఎస్ జగన్ శాసనసభకు హాజరయ్యారు. తర్వాత గవర్నర్ ప్రసంగ సమయంలో సభలోకి వచ్చి పట్టుమని 11 నిమిషాలు కూడా ఉండకుండా వెళ్లిపోయారు. ఆ తర్వాత బెంగళూరు ప్యాలెస్‌కే పరిమితమైపోయి ఏ అమావాస్య, పౌర్ణమికో రాష్ట్రానికి వస్తున్నారనే అపవాదు మూటగట్టుకున్నారు. తద్వారా సభలో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించి, సమస్యలపై నిలదీసే సువర్ణావకాశాన్ని జగన్ వదులుకున్నారు. కనీసం తనకు మిగిలిన 10 మంది శాసనసభ్యులని కూడా అసంబ్లీ మెట్లు ఎక్కనీయకుండా కట్టుబాటుచేశారు. ఇక పర్యటనల విషయానికి వస్తే తమ కార్యకర్తలను, సోషల్ మీడియా ప్రతినిధులను, సానుభూతిపరులను చంద్రబాబు ప్రభుత్వం టార్గెట్ చేసిందని ఆరోపిస్తూ, జైళ్లకు పరామర్శల యాత్రలు చేశారు. అయితే ఆయా సందర్భాల్లో మందీమార్బలం, కార్యకర్తల రప్పారప్పా నినాదాలతో వాటిని రణరంగంగా మార్చివేశారు. ఫలితంగా ప్రజల నుంచి రాబట్టాలనుకున్న సానుభూతిని స్వయంగా తానే వమ్ముచేసుకుంటున్నారు. తద్వారా కూటమి ప్రభుత్వాన్ని ప్రజల్లో దోషిగా చూపించదానికి బదులు, తమ పార్టీ కార్యకర్తలు, నాయకులే దోషులుగా మిగిలిపోయే పరిస్థితిని తెచ్చుకున్నారు. అయినా జగన్ మేలుకోకపోగా, ఇంకాఇంకా తప్పులు చేస్తూ ప్రజల్లో మరింత పలుచనవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

### పోలీసు వ్యవస్థతోనూ పేచీలే..!

అలాగే తమ నాయకులపై, కార్యకర్తలపై కేసులు పెట్టే కూటమి ప్రభుత్వాన్ని, దాన్ని నడిపించే ప్రభుత్వ పెద్దలను విడిచిపెట్టి, మళ్ళీ మేం వస్తే పోలీసులను వదలబోమంటూ జగన్ శపథాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. శాంతి భద్రతలకు సంబంధించి పాలకుల ఆదేశాలను పాటించడం తప్ప పోలీసు వ్యవస్థకు మరో ప్రత్యామ్నాయం ఉండదన్న సంగతి జగన్ కంటే బాగా ఇంకే నాయకుడికీ తెలియదన్నది బహిరంగ రహస్యమే. అలాంటి సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాప్రతినిధులను, నాయకులను వదిలిపెట్టి కేవలం ఇన్‌స్పెక్టర్లు, డీఎస్పీలు టార్గెట్‌గా జగన్ ముందుకు సాగడం ఆయన అపరిపక్వ రాజకీయ నైజాన్ని తెలియజేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. పైగా రిటైర్డ్ అయినా వదలబోమని చెప్పడం, సప్త సముద్రాల అవతల ఉన్నా తీసుకొచ్చి అంతు చూస్తామంటూ ప్రకటించడం విడ్డూరంగా ప్రజలు భావించే పరిస్థితి నెలకొంది. ఇక విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ విషయానికే వస్తే, తొలుత జగన్ పార్టీ దాన్ని ప్రాధాన్యత లేని అంశంగానే చూసింది. తీరా చంద్రబాబు ప్రభుత్వానికి మైలేజ్ వస్తుందనే ప్రచారం సాగడంతో, గూగుల్ డేటా సెంటర్ వల్ల కనీసం పట్టుమని పది ఉద్యోగాలు కూడా రావని, అదో గోడౌన్ లాంటి నిర్మాణంగా మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. చివరికి ప్లేటు ఫిరాయించి తాను ఆదాని సంస్థద్వారా డేటా సెంటర్ తీసుకొస్తే, చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నారని సాక్షాత్తూ జగన్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ మాట్లాడడం వైఎస్సార్‌సీపీ నిలకడలేని రాజకీయాలకు తార్కాణంగా నిలిచిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### మెడికల్ కాలేజీల విషయంలో ఇమేజ్ డ్యామేజ్...!

ఇక రాష్ట్రంలో ప్రస్తుతం హాట్‌హాట్‌గా మారిన మెడికల్ కాలేజీల విషయాన్నే తీసుకుంటే, మొత్తం 17 కళాశాలల్లో పదిందిని పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానంలో నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తమ హయాంలో పురుడుపోసుకున్న మెడికల్ కళాశాలలను కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు చంద్రబాబు అప్పగిస్తున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. అయితే, ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలందించడంతో పాటు పనులు జాప్యం కాకుండా నివారించడం, ఆర్థిక కష్టాల్లో ఉన్న ప్రభుత్వానికి మెడికల్ కళాశాలలు భారం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో భాగంగానే పీపీపీ విధానాన్ని అమలుచేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, దేశంలోని మెట్రో స్టేషన్లు, ఓడరేవులు, నేషనల్ హైవేలు, ఎయిర్‌పోర్టులన్నీ పీపీపీ విధానంలో రూపొందుతున్నాయని, దేశంలోని కీలక పార్టీలన్నింటితో కూడిన పార్లమెంటరీ స్థాయీ సంఘం, నీతి ఆయోగ్ వంటి జాతీయసంస్థలు కూడా అభివృద్ధిలో దేశానికి పీపీపీ విధానమే సరైందని సూచించిన విషయాన్ని కూటమి ప్రభుత్వ పెద్దలు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. కీలకాంశాలైన అమరావతి, పోలవరంతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా సాగాలంటే వివిధ పరిశ్రమలు, ఆస్పత్రులు, భవనాలు, కార్యాలయాల నిర్మాణాలను పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్‌లో నిర్మించడమే సహేతుకమని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. మెడికల్ కాలేజీల నిర్మాణంలో 30 శాతం కేంద్ర కోటా, 30 శాతం రాష్ట్ర కోటా ఉంటుందని, 40 శాతంపెట్టుబడి ప్రైవేటు వ్యక్తులు వెచ్చించి, మౌలిక సదుపాయాలు, నిర్వహణ బాధ్యతలు మాత్రమే చూస్తారని ప్రభుత్వం తమ ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించే రాష్ట్ర రోడ్లకు, పీపీపీ పద్ధతిలో నిర్వహించే నేషనల్ హైవేలకు తేడా గమనించాలని ఈ సందర్భంగా విమర్శకులకు సూచించింది. అలాగే దేశంలో ఎయిర్ పోర్టులు ప్రభుత్వానివే అయినా వాటిని నిర్మించి నిర్వహిస్తున్న జీఎంఆర్, ఆదాని వంటి సంస్థల పనితీరు వల్ల ప్రయాణికులకు అదనపు ప్రయోజనాలు, సకాలంలో సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, ఇదే తరహాలో పోర్టులు, మెట్రోస్టేషన్లలో నాణ్యమైన సేవలు ప్రజలకు అందుతున్నాయని సాక్ష్యంగా చూపడుతోంది.

### కోర్టులలోనూ చుక్కెదురు!

ఇలా వైద్యరంగంలోనూ ఉత్తమ సేవలు, అధునాతన సౌకర్యాలు కల్పన కోసమే మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే దీన్ని అంగీకరించని జగన్ పార్టీ నేతలు హైకోర్టులో కేసులు సైతం వేశారు. కేవలం లాభాపేక్ష కోసమే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు స్కెచ్ వేసిందని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. కానీ, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవని, అయినా ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులతో కలిసి మెడికల్ కళాశాలలు నిర్వహిస్తే తప్పేముందని న్యాయమూర్తి ప్రశ్నించారు కూడా. అయినా మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం కానివ్వబోమంటూ కోటి సంతకాలను సేకరించడమే కాకుండా వాటిని రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు అందజేసి కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవాలని జగన్ స్వయంగా కోరారు.

### అరెస్టుల పేరుతో బెదిరింపులు..!

ఇంతవరకు బాగానే ఉన్నా, పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీలను దక్కించుకునే సంస్థల యాజమాన్యాలను తాము అధికారంలోకి వచ్చిన 2 నెలల్లోనే అరెస్టు చేస్తామని ప్రకటించడం ద్వారా జగన్ సెల్ఫ్‌గోల్ వేసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఇప్పటికే ప్రభుత్వంలో ఉన్నప్పుడు తమ అసంబద్ధ చర్యల ద్వారా పెట్టుబడిదారులను పారిపోయేలా చేశారనే అపవాదు జగన్‌కు ఉంది. ఇలాంటి సమయంలో మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో మంజూరు చేస్తున్న కూటమి ప్రభుత్వ పెద్దలపై కేసులు వేయడమో, లేక సుప్రీంకోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకోవడమే చేయకుండా పీపీపీ పద్ధతిలో కళాశాలలు దక్కించుకున్న వారిని అరెస్టు చేస్తామంటూ ప్రకటించి జగన్ మరో తప్పిదానికి పాల్పడ్డారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడిదారులను బెదిరించడం, పారిశ్రామికవేత్తలను పారిపోయేలా చేయాలనుకోవడం, అభివృద్ధి పనులను అడ్డుకోవడం ద్వారా ఏ నేతా ప్రజాభిమానాన్ని పొందలేరని, ఈ విషయాన్ని గ్రహించకుండా జగన్ తప్పులపై తప్పులు చేస్తూ తనకున్న ప్రజాబలాన్ని తానే తగ్గించుకుంటున్నారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ప్రభుత్వాధినేతగా, తన విధానాలు, ప్రవర్తనతో ఆకట్టుకోలేక పోయిన జగన్, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను సైతం సమర్థంగా పోషించడం లేదనేది విమర్శకుల మాట. ఇకనైనా విధానాలను రూపొందించే సూత్రధారులను వదిలి, పాత్రధారులైన ఉద్యోగులు, పెట్టుబడిదారులను టార్గెట్ చేయడం మానుకుంటే జగన్‌కు ఆయన పార్టీకే మంచిదన్నది మేధావుల అభిప్రాయం. అత్యంత లౌక్యంగా, రాజకీయ చాణక్యతతో అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకోవలసిన జగన్ 'నేలవిడిచి సాము చేస్తున్నారు' అన్న మాట సర్వత్రా వినిపిస్తోంది..!

# గూడూరు.. ఇక నెల్లూరులోనే

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికలప్పుడు గూడూరును నెల్లూరులో కలుపుతామని ఇచ్చిన హామీలు కూడా నెరవేరవా?..అంటూ ప్రజలు ఆవేదనకు గురయ్యారు. అయితే, జిల్లాలోని సీనియర్ నాయకులు ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పట్టిన పట్టు విడవకుండా నెల్లూరుజిల్లాకి న్యాయం జరిగేందుకు.. ప్రభుత్వంలో ఉండి కూడా పెద్ద పోరాటమే చేశారు.

### ఆనం కృషి అమోఘం :

పునర్విభజనలో జిల్లాకి ఇబ్బంది లేకుండా మంత్రి ఆనం చేసిన కృషి అమోఘం. అందులోనూ సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్న మండలాలను తీసుకెళ్ళి తిరుపతిలో కలిపేస్తే నీళ్ళగొడవలు జరుగుతాయని ఆనం రామనారాయణరెడ్డి పదేపదే ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ప్రత్యేకించి రామనారాయణరెడ్డి గతంలో వెంకటగిరి, రాపూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేగా ఉండడం, ఆయా ప్రాంతాల స్థితిగతులు కూలంకుషంగా తెలిసిన నేత కావడం, అందులోనూ ఇప్పుడు దేవాదాయశాఖ మంత్రిగా కూడా ఉన్న అనుభవజ్ఞులు కావడంతో ఆనం మాటకి అటు ప్రజల్లోనూ – ఇటు ప్రభుత్వంలోనూ మరింత ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో ఆయన నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కూడా కలసి, పరిస్థితులను వివరించారు. కృష్ణపట్నం పోర్టుతో పాటు పలు పారిశ్రామికవాడల పరిధిల్లో ఉన్న గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను నెల్లూరుజిల్లా పరిధిలోనే ఉంచాలని ముఖ్యమంత్రిని కోరారు. అదేవిధంగా కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు కూడా నెల్లూరుజిల్లాలోనే ఉండాలని విన్నవించారు. దీంతో ఆనం విజ్ఞప్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి పునరాలోచించి, ఆయా మండలాలకు అన్యాయం జరగకుండా అటు నాయకుల కోరిక, ఇటు ప్రజల అభీష్టం మేరకు జిల్లాకు సానుకూలమైన నిర్ణయాలు తీసుకున్నారు.

### ఎంపీ, ఎమ్మెల్యేలూ రంగంలోకి దిగారు

పునర్విభజనలో జిల్లాకి ఎట్టిపరిస్థితుల్లోనూ అన్యాయం జరగకూడదంటూ ఆనం రామనారాయణ రెడ్డి కృషితో పాటు, మరోవైపు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా రంగంలోకి దిగారు. నేరుగా క్యాబినెట్ కమిటీకి లేఖ రాసి, గూడూరును నెల్లూరులో కలుపుతామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, లోకేష్ ఇచ్చిన హామీలను కూడా గుర్తు చేశారు. అదేవిధంగా రాపూరు–సైదాపురం– కలువాయి మండలాల ప్రజలు ప్రతి చిన్నపనికీ తిరుపతి జిల్లాకి వెళ్ళడమంటే ఎంతో వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని, సాగునీటి ప్రాజెక్టులకి సంబంధించి కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అధిష్ఠానం దృష్టికి తెచ్చారు. ఇంకోవైపు గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్‌కుమార్ అసెంబ్లీలోనే తమ గళం వినిపించి, గూడూరును నెల్లూరులోనే ఉంచాలంటూ విన్నవించారు. గూడూరు ప్రాంతంలో జరుగుతున్న ఆందోళనలను కూడా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్ళారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా జిల్లా పునర్విభజన జరిగితే బావుంటుందని విన్నవించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కూడా సమస్య తీవ్రతని గూడూరు ప్రాముఖ్యతని, ఆ మూడు మండలాల ప్రాధాన్యతను ముఖ్యమంత్రికి స్వయంగా వివరించారు. ఇలా.. అన్ని వైపుల నుంచి నాయకుల మూకుమ్మడి ముమ్మర ప్రయత్నాలతో పాటు.. జిల్లాలోని గూడూరు, రాపూరు, సైదాపురం, కలువాయి ప్రాంతాల ప్రజలు గత కొద్దిరోజులుగా ఆగకుండా చేసిన ఆందోళనలు, నిరసనలు, నిరాహారదీక్షలు, జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు..అన్నిటి మూలంగా క్యాబినెట్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయాలు.. జిల్లాకి సానుకూలంగానే జరిగాయి. గూడూరు పట్టణంతోపాటు గూడూరు నియోజకవర్గంలోని ప్రధాన మండలాలైన కోట, చిల్లకూరు మండలాలు నెల్లూరులో చేరేవిధంగా నిర్ణయం తీసుకున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలు కూడా నెల్లూరు జిల్లాలోనే ఉండేందుకు ఆమోదం లభించడంతో... కథ సుఖాంతమైంది.

### కందుకూరుకు కూడా న్యాయమే జరిగింది :

కందుకూరు నెల్లూరుజిల్లాలో ఉండడం వల్ల కందుకూరు నియోజకవర్గంలోని అనేక దూరప్రాంత మండలాల ప్రజలు నెల్లూరుకు రావడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారంటూ అక్కడి నాయకులు పదేపదే ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీంతో, కందుకూరును ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడి ప్రజల కోరిక కూడా అదేకావడం, ఇప్పుడది నెరవేరడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ప్రకాశం జిల్లాలో రామాయపట్నం, నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం ఓడరేవులతో పాటు దుగరాజపట్నం(వాకాడు మండలం) ఓడరేవు తిరుపతి జిల్లాలో ఉంటే, మూడు జిల్లాల్లో మూడు ఓడరేవులు ఉన్నట్లుంటుందని, తద్వారా రవాణా సౌకర్యాలకి ఉపయోగంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో నెల్లూరు జిల్లాలోని వాకాడు, చిట్టమూరు మండలాలని తిరుపతి జిల్లాలోనే ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎట్టయితేనేం.. చివరికి తాము కోరుకుంటున్నట్లుగా జిల్లాకి మంచే జరిగిందంటూ ప్రజలు ఆందోళనలు విరమించి, ప్రభుత్వానికి..ముఖ్యంగా సమస్య మరింత జటిలం కాకముందే స్పందించిన నెల్లూరు నేతలకి ప్రజలు కృతజ్ఞతలు చెప్తున్నారు.

# రామరాజ్య స్థాపనే లక్ష్యంగా.. ప్రభుత్వ కృషి!

• ఏ.ఎస్.పేటలో జిల్లా నేతలు

రాష్ట్రంలో సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ రామరాజ్య స్థాపనే లక్ష్యంగా తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. డిసెంబరు 31న ఆత్మకూరు నియోజకవర్గం అనుమసముద్రంపేటలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.4.50 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మహిళలకు దీపం పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఉత్తమ టీడీపీ కార్యకర్తలకు అభినందన పత్రాలు పంపిణీ చేశారు. తొలుత ఏఎస్ పేట దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్సీతో కలిసి నూతన సంవత్సర కానుకగా ఒకరోజు



వృద్ధులకి పెన్షన్లను పంపిణీ చేస్తున్న ఆనం, వేమిరెడ్డి, బీద, చేజర్ల

ముందుగానే పేదలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి ఆనం మాట్లాడుతూ, పేదల సంక్షేమ కార్యక్రమాలే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని చెప్పారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుపరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. ఏఎస్‌పేటలో కొత్త సంవత్సరం ఒక రోజు ముందుగానే వచ్చిందని, పింఛన్ల పంపిణీతో ప్రజల్లో సంతోషం కనిపిస్తోందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 68 లక్షల మంది పింఛనుదారులకు రూ.50 వేల కోట్లు పెన్షన్ల కోసం వ్యయం చేశారని, నెలకు రూ.2,750 కోట్లను కేవలం పింఛన్ల కోసమే ముఖ్యమంత్రి కేటాయించారని తెలిపారు.

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నారని అన్నారు. అయితే, ప్రతిపక్షం తప్పుడు ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్నారు.



లాయర్
జనవరి 02, 2026

# ఈ ఏడాదైనా సుఖశాంతులు వెల్లివిరియాలి!

కొత్త సంవత్సరం వస్తుందనుకున్నప్పుడల్లా ఎంతో సంతోషంగానే ఉంటుంది. కొత్త ఏడాది నుంచైనా అన్నీ శుభాలే కలగాలని కూడా అనుకుంటాం. కానీ, మనమొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుందన్నట్లుగా ప్రతి ఏడాదీ మాన వాళికి అనేక రకాల కష్టాలు తప్పడం లేదు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు యుద్ధాలు, అంతర్యుద్ధాలతో అట్టుడికిపోతు న్నాయి. ఇజ్రాయిల్-లెబనాన్, రష్యా-ఉక్రెయిన్ వంటి దేశాల్లో యుద్ధాలు, మరికొన్ని దేశాల్లో ఆకస్మికంగా జరిగే ప్రమాదాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో జనం బెంబేలెత్తుతూనే ఉన్నారు. కెన్యా, మొరాకో, ఇండో నేషియా, మెక్సికో తదితర దేశాల్లో పాలనలు సరిగా లేవంటూ యువత అగ్రహోదగ్రులై భీభత్సాలు సృష్టించడంతో ఆయా దేశాల్లో ఆందోళనకర పరిస్థితులు అలముకున్నాయి. ఇవన్నీ చాలవన్నట్లు పలు దేశాల్లో అప్పటికప్పుడు జరిగే హింసాత్మక ఘటనల్లోనూ, అనేకమంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఉగ్రవాదుల ఘాతుకాలతో మనదేశంలోనూ కల్లోలం రేగింది. పహల్గాం ఘటనలతో ఉవ్వెత్తున ఎగిసిన భారత్ కోపాగ్నికి పాక్ ఉగ్రశిబిరాలు మట్టికరవక తప్పలేదు. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని..ప్రపంచశాంతిని కోరుకునే భారత్‌ని కూడా రెచ్చగొట్టే ముష్కరమూకలకు ఎట్టకేలకి తగిన శాస్తి జరిగింది. 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఏదేమైనా..ప్రపంచం నానాటికీ యుద్ధాలు.. ఆందోళనల వైపే వెళ్తుండడం, అన్నవస్త్రాలకు కరువైనా అణ్వాస్త్రాలకు మాత్రం భారీ నిధులు ఖర్చుచేస్తుండడం విచారకరం. విధివశాత్తూ జరిగే ప్రమాదాలను అప్పటికప్పుడు ఎదుర్కోవడం కష్టమే కావచ్చు కానీ, ముందుజాగ్రత్త ఉంటే ఎన్నో రకాల సమస్యల సుడిగుండాలను మనం సులువుగానే దాటవచ్చన్నది అందరికీ తెలిసిందే. అయితే, మంచి ఆలోచనలు మస్తిష్కంలో ఎన్నున్నా.. వాటి అమలులో అలక్ష్యం వల్లనే అనేకదేశాల్లో అనర్థాలూ జరుగుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు రకరకాల ఆందోళనకర పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ ఏడాది గతంలో కంటే ప్రకృతి విపత్తులు మానవాళిని హడల గొట్టేశాయి. భూతాపం పెరిగిపోయి, భూగోళమంతా అత్యధిక ఉష్ణోగ్రతలతో భగ్గుమంటోంది. కాలుష్యకారక ఇంధనాల వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో వాతావరణమంతా అస్తవ్యస్తమైపోయింది. రుతువులు క్రమం తప్పాయి. వరదలు, కరువులు, కార్చిచ్చులు పలుదేశాలని భీతావహం చేశాయి. చలికాలంలో ఓపలేనంత చలి, వేసవిలో భరించలేనంత వేడితో ప్రజలు అల్లాడిపోయారు. కుండపోత వానలు, తుఫానులతో అనేక దేశాలు వణికిపోయాయి. యూరప్ దేశాల్లో వడగాడ్పుల వల్ల వేలాదిమంది ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగింది. మనదేశంలోనూ అకాలవర్షాలు, పెను గాలులు, ప్రకృతి వైపరీత్యాలు గతంలో కంటే గణనీయంగా పెరిగిపోయాయి. అమెరికాలో కార్చిచ్చులు, చైనాలో వరదలు, భారత్‌లో కుండపోతవానలు, బ్రెజిల్‌లో కరువు పరిస్థితులు.. ఇలా ఏ దేశం చూసినా..ఏమున్నది గర్వకారణం..విపత్తులు, విధ్వంసాలతో నలిగిపోతున్నాయి. ఘర్షణలు, యుద్ధాలు నివారించుకునేందుకు చర్చలే కీలకం. సుహృద్భావ వాతా వరణంలో సమస్యలు చర్చించుకుంటే యుద్ధాల దాకా పోనవ సరం లేదు. ప్రపంచాన్ని కాపాడేది శాంతి మంత్రమేనన్నది మరువరాదు. ఇకపోతే, ప్రకృతి విపత్తులను పూర్తిస్థాయిలో ఆపలేకపోయినా, కొంతమేరకైనా ఆ నష్టాల నుంచి గట్టెక్క వచ్చు. భూతాపం పెరగకుండా చూసుకోవడం ముఖ్యం. అడవులను నరికేయడం, చెట్లను కొట్టేయడం వంటివన్నీ ప్రకృతితో పరిహాసాలే. అందుకు మూల్యమే ఇదంతా.

ఇప్పటికైనా అన్నిదేశాలు, అన్ని ప్రాంతాల్లో ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. మొక్కలు నాటుకోవాలి. వృక్షాలను సంరక్షించుకోవాలి. పచ్చదనంతో నేలంతా కళ కళలాడే చూసుకోవాలి. అప్పుడే ఈ ఏడాదే కాదు.. ఏ ఏడాదైనా సంతోషంతో గడుస్తుంది. విధ్వంసాలు, విపత్తులతోనే 2025వ సంవత్సరం గడిచిపోవడం బాధాకరం!

ఇకనైనా ఈ యుద్ధాలు పోయి.. శాంతియుత వాతా వరణం ఏర్పడాలని, మానవాళికి ప్రమాదకర పరిస్థితులు తొలగి.. ఈ ఏడాది కొత్తసంవత్సరం (2026)లోనైనా సకల మానవాళి అంతా సుఖశాంతులతో జీవించాలని మనసారా కోరుకుందాం.! శుభం భూయాత్!..

అందరికీ 'లాయర్'.. నూతన సంవత్సర శుభాకాంక్షలు!...

# విషయం మంచిదే.. వాడిన భాషే బాగలేదు!

ఆడవాళ్ళ వస్త్రధారణ విషయంలో హీరో శివాజీ చేసిన కామెంట్లు నూటికి నూరు పాళ్ళు సమర్థించదగినవే. అయితే, ఆయన వాడిన భాషే అభ్యంతరకరం. మనం చెప్పదలచుకుందేదైనా సరళమైన భాషలో చెప్పొచ్చు. కానీ, శివాజీ విచక్షణ కోల్పోయి మాట్లాడాడు. అలా మాట్లాడడమే కాకుండా తన మాటలని సమర్థించుకుంటూ అహంకార ధోరణిని ప్రదర్శించాడు. ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. నిజానికి ప్రస్తుతం ఆడవాళ్ళు ధరిస్తున్న వస్త్రధారణ కన్నా శివాజీ వాడిన పదాలే జుగుప్సాకరంగా వున్నాయి. తమ వేషభాషలతో సమాజాన్ని ప్రభావితం చేసే సెలెబ్రిటీలు ఎవరైనా సరే.. మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడితే మంచిది..!

– డి.హరిత, గూడూరు.

# ఆక్రమణల మయమైపోయిన చిల్డ్రన్స్ పార్కు రోడ్డు!

నెల్లూరు నగరంలో నుండి జాతీయ రహదారిని కలిపే ప్రధాన మార్గం చిల్డ్రన్స్ పార్కు రోడ్డు. అలాంటి ప్రధానమైన ఈ రోడ్డు ఆక్రమణలమయమైపోయింది. ముఖ్యంగా పార్కుకి ఎదురుగా వున్న రోడ్డులో వ్యాపారవేత్తలది ఇష్టారాజ్యమైపోయింది. ప్రజలు నడవడానికి కట్టిన ఫుట్‌పాత్‌లని ఆక్రమించుకుని అంగళ్ళు పెట్టేశారు. పార్కింగ్ ప్రదేశాన్ని కూడా వదిలిపెట్టలేదు. ముఖ్యంగా తాను విలేఖరిని అని చెప్పుకుంటున్న ఒక స్వీట్ దుకాణం యజమాని రోడ్లోనే పొయ్యిలు పెట్టి వంట చేసేస్తున్నాడు. నన్నడిగే మగాడు ఎవరు అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు. మిగిలినవాళ్ళు కూడా ఆయనని ఆదర్శంగా తీసుకుని రోడ్డు ఆక్రమించేశారు. మునిసిపల్ కమిషనర్ గారు స్పందించి చర్యలు తీసుకోవాలి. మూడుహాళ్ళ రోడ్డులో దశాబ్దాల తరబడి రోడ్డుని ఆక్రమించి దుకాణం నడుపుతుండిన బాబా సమోసా అంగడిని మునిసిపల్ అధికారులు నిర్మొహమాటంగా తొలగించారు. ఆదిత్యనగర్ ప్రధాన రహదారిలో కూడా అదే తరహా విధానాన్ని పాటించి అక్రమణలని తొలగించాలని కోరుతున్నాం. లేని పక్షంలో కోర్టుని ఆశ్రయించాల్సి వస్తుందని తెలియజేస్తున్నాం...!

జి.వీ.నాగరాజారావు, అడ్వకేట్, హైకోర్టు.
మరియు లక్ష్మీనగర్, ఆదిత్యనగర్ వాసులు.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# సమన్వయ లోపం
## కనకదుర్గమ్మకి శాపమా?

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి విద్యుత్ శాఖ అధికారులు కరంటు కట్ చేయడం సిగ్గుచేటైన విషయం. దుర్గమ్మ తల్లి ఆలయం ప్రభుత్వ అధీనంలో పనిచేసే దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో వుంది. అంటే, ఆ ఆలయం కూడా ప్రభు త్వంలో భాగమే. అలాంటి దేవస్థానానికి సంబంధించి 2.5కోట్లు కరంటు బకాయిలు చెల్లించలేదని ఆలయానికి విద్యుత్ సరఫరా నిలిపేశారన్న వార్త అమ్మవారి భక్తుల మన సులని నొప్పించింది. ఆలయ అధికారుల నిర్లక్ష్యం, విద్యుత్‌శాఖ సిబ్బంది అత్యు త్సాహం దుర్గమ్మకి శాపంగా మారడం అత్యంత బాధాకరం. ఇది అధికారుల సమ న్వయ లోపం అని ముఖ్యమంత్రి, విద్యుత్ మంత్రి ఇతర ఉన్నతాధికారులు తమని తాము సమర్థించుకోవడం భావ్యం కాదు. అటు దేవస్థానం, ఇటు విద్యుత్ శాఖలకి సంబంధించి ఈ దుస్థితికి కారకులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో ఇలాంటి సంఘ టనలు మళ్ళీ జరగవు...!

జీ.వీ.సుబ్బయ్య - పిడుగురాళ్ళ.

# సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 123

# దృష్టి లోపం.. బాలల భవితకు శాపం!

ఆంధ్రప్రదేశ్‌లోని అనేకమంది బాలబాలికలకి కంటి చూపు మందగించడం పెద్ద సమస్యగా అవతరించింది. ముఖ్యంగా ఈ దృష్టి లోపం విద్యార్థినీవిద్యార్థుల పాలిట పెనుశాపంగా మారింది. అంచనాలకి కూడా అందని స్థాయిలో ఈ కంటి సమస్య భావిభారత పౌరులని వేధిస్తోంది. కళ్లకి సంబంధించిన పలురకాల సమస్యలను ఎదుర్కొంటున్న చిన్నారుల సంఖ్య నానాటికీ గణనీయంగా పెరుగుతుండడం వారి తల్లితండ్రులని ఆందోళనకి గురిచేస్తోంది. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలలో అనేక స్వచ్ఛంద సంస్థలు తరచూ నిర్వహిస్తున్న కంటిపరీక్షలలో ఖంగుతినే అంశాలు బయటపడుతున్నాయి. సరిగా కళ్ళు కనిపించక ఇబ్బందిపడుతున్న వారి సంఖ్య అంతకంతకీ పెరుగుతూ ఉండడం చూసి కంటివైద్య నిపుణులు సైతం ఆశ్చర్యపోతు న్నారు. పుస్తకాల్లో రాస్తున్న అక్షరాలే కాకుండా, బోర్డు మీదున్న అక్షరాలు కూడా సరిగ్గా కనిపించక అవస్థపడుతున్న పిల్లల సంఖ్యని గమనించిన నిపుణులు షాకవు తున్నారు. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వ మరియు ప్రయివేటు స్కూళ్ళలో ఏడాది పాటు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో అనేక ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి.

ఇప్పటివరకు 45వేల పాఠశాలల్లోని 60లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహిం చగా, అందులో ప్రతి వందమందిలో సుమారు 15 మంది కంటిచూపు సరిగా కనిపించక బాధపడుతున్నారనే విషయం బయటపడింది. ఆ పిల్లల్లో కనీసం రెండు లక్షల మందికి తక్షణం కళ్ళద్దాలు అవసరమని కూడా వైద్యనిపుణులు సూచించారు. అంటే, దీన్నిబట్టి విద్యార్థిలోకాన్ని దృష్టిలోపం ఎంతగా బాధిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు ఒక తరగతి గదిలో ఒకరో ఇద్దరో మాత్రమే కళ్ళద్దాలు పెట్టుకుని కనిపించే వారు. ఇప్పుడు ఏ ఒకరో ఇద్దరో తప్ప, మిగిలినవారందరూ కళ్లద్దాలు పెట్టుకోక తప్పదన్నట్లుగా పరిస్థితి తయారయ్యిందని డాక్టర్లు చెప్తున్నారు. ఈ పరిస్థితిని తీవ్రమైన అంశంగా పరిగణించాలని వారు అభిప్రాయపడుతున్నారు.

## స్మార్ట్‌ఫోన్‌లతో కళ్ళకి సమస్యలు..!

ఫోన్‌లు అదేపనిగా చూస్తే కళ్లు దెబ్బతింటాయని... అలాగే, టీవీలు కూడా గంటల తరబడి చూడడం మంచిదికాదని మొత్తుకుని చెప్తున్నా వినేవారెవరూ లేరు. ఫోన్ చేతికి ఇవ్వకపోతే అన్నం కూడా తినం అని మారాం చేసే పసిపిల్లలు కోకొల్లలు. నేటి తరం చిన్నారులు అంతగా వాటికి బానిసలైపోతున్నారు. ఫలితంగా కళ్ళ సమస్యలు భారీస్థాయిలో పెరిగిపోతున్నాయి. అంతేకాదు, పెరిగిపోయిన ఆధునీకతని ఆసరాగా చేసుకుని డిజిటల్ తరగతుల పేరుతో ఎలక్ట్రానిక్ బోర్డులపైన పాఠాలుచెప్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్ క్లాసులంటూ ఫోన్‌లలోనే బోధన ముగించేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులలో తల్లితండ్రులు కూడా వాటిని కాదనలేక పోతున్నారు. వాటి నుంచి తమ పిల్లలని తప్పించలేకపోతున్నారు. ఒకవేళ వాటికి దూరంగా ఉంచితే తమ పిల్లలు పాఠాలెక్కడ మిస్సయిపోతారోనని భయపడిపోతున్నారు. మారుతున్న జీవనశైలితో పాటు స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్‌లు అతిగా వాడుతుండడం వంటి విపరీత ధోరణుల వల్లే కంటిచూపు మందగించిపోతోందని కంటివైద్యులు స్పష్టంగా చెప్తున్నారు. ముఖ్యంగా పట్టణప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో కంటిసమస్యలు ఎక్కువగా ఉంటు న్నాయని అంటున్నారు. మొబైల్ ఫోన్లతోనూ, టీవీలతోనూ వాళ్ళు ఎక్కువ సమయం గడపడమే అందుకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కళ్ళ మంటలు, నొప్పితో అవస్థలు..!

రాష్ట్రంలోని చాలామందికి కేవలం చూపు తగ్గిపోవడమే కాకుండా, అనేకమంది కళ్ళ మంటలు, కంటినొప్పులతో కూడా బాధపడుతున్నారని తాజాగా చేసిన సర్వేలో గుర్తించారు. చదవడానికి, రాయడానికి కూడా ఇబ్బందిగా పడుతున్నారని గమనిం చారు. కళ్ళలో నుండి నీళ్ళు కారడంతో పాటు పదేపదే కళ్ళను చేతివేళ్ళతో రుద్దుకోవ డంతో, కళ్ళు ఎర్రగా మారి చూపు మసకబారుతుందని వైద్యనిపుణులు చెప్తున్నారు. ఇలాంటి సమస్యలకి ఆరంభ దశలోనే వైద్యం చేయకపోతే, అవి ఇంకా తీవ్రరూపం దాలుస్తాయని అంటున్నారు. దూరదృష్టి లోపంతో 70శాతం, విటమిన్ ఏ లోపంతో 15శాతం, ఇతరత్రా సమస్యలతో మరో 10శాతం మంది బాలబాలికలు కంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ విభాగాల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.


## జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పే..!

ఇప్పటికే ప్రభుత్వ వైద్యబృందాలు అంధత్వ నివారణ సంస్థలతో కలసి విద్యా లయాలలో కంటి పరీక్షలు చేస్తున్నాయి. చిన్నారులు వైద్యుల సూచనలు తప్పక పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అదేపనిగా ఫోన్‌లు, టీవీలు చూడకుండా, కనీసం ప్రతి పది నిమిషాలకొకసారైనా దృష్టిని పక్కకి మరల్చాలని, లేదంటే కళ్ళు దెబ్బతింటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తల్లితండ్రులు సైతం జాగ్రత్తలు తీసుకుని, తమ పిల్లలు కంటివ్యాధుల బారినపడకుండా వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. మూడేళ్ళలోపు చిన్నారులకు అసలు ఫోన్ అలవాటు చేయకూడదు. చేశారంటే వారి కంటిచూపు మన నిర్లక్ష్యం వల్లనే సమస్యలో పడుతుందనే విషయం గ్రహించుకోవాలి.

## సర్వేంద్రియాణాం నయనం ప్రధానం..!

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'.. అంటే అన్ని ఇంద్రియాలలో కళ్ళు ముఖ్యమైనవి అని అర్థం. ఇది ఆయుర్వేదం మరియు భారతీయ సంప్రదాయాల్లో ప్రసిద్ధి చెందిన సూక్తి. దీని ప్రకారం, మన జ్ఞానంలో దాదాపు 80% కళ్ళ ద్వారానే లభిస్తుంది. కాబట్టి కంటి చూపు అత్యంత విలువైంది. దానిని రక్షించుకోవలసిన బాధ్యత మనదే. కంటి చూపే లేకుంటే ఈ లోకాన్ని చూడలేం. దృష్టి లోపాలతో జీవితం గడపలేం. అందుకే తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సలహాలు పాటించాలి. పిల్లలని ఫోన్‌లకి బానిసలు కాకుండా చూడాలి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శరవేగంగా పరుగులు పెడుతున్న నేటి యుగంలో మారుతున్న జీవనశైలి వల్ల జీవితాలు కష్టాల్లో పడకుండా పిల్లలు, పిల్లలతో పాటు పెద్దలు కూడా కంటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కంటి సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయ కూడదు. అలా చేస్తే.. ఆ తర్వాత చింతించక తప్పదు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకు న్నట్లు'గా జరగాల్సిన నష్టం జరిగాక తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం దొరకదు. తస్మాత్ జాగ్రత్త...!

- రాజశ్రీ



# దగదర్తి విమానాశ్రయం ఏర్పాటులో ముందడుగు

**భూ సేకరణ నివేదికకు.. మంత్రివర్గం ఆమోదం!**

నెల్లూరుజిల్లా వాసుల చిరకాల కోరిక అయిన దగదర్తి విమనాశ్రయం ఏర్పాటుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. విమనాశ్రయం భూసేకరణకు సంబంధించిన సమగ్ర నివేదికను డిసెంబరు 29న జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. సోమవారం అమరావతి సచివాలయంలో జిల్లా కలెక్టర్, దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వపరంగా చేపట్టిన కార్యాచరణ, భూసేకరణ పురోగతి నివేదికను ప్రభుత్వానికి సమర్పించగా ఆ నివేదికను మంత్రివర్గం ఆమోదించింది. ఈ సందర్భంగా, దగదర్తి విమనాశ్రయం ఏర్పాటు దిశగా విశేషంగా కృషి చేస్తున్న మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి శాసనసభ్యులు డివి కృష్ణారెడ్డిలకు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుతో నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందని, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఇది దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు.

# ముఖ్యమంత్రికి.. ధన్యవాదాలు!

**• సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి**



ప్రజాభీష్టం మేరకే.. జిల్లాల పునర్విభజన జరిగిందని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రజలు కోరుకున్న విధంగానే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జిల్లాల్లో మార్పులు చేర్పులు చేసిందని, ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరుజిల్లాలోనే కొనసాగించడం హర్షదాయకమని అన్నారు. తమ వినతులను మన్నించి సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ మండలాలను యథాతథంగా కొనసాగిస్తున్నారన్నారు. గూడూరు నియోజకవర్గంలో ప్రధాన భాగమైన మూడు మండలాలను నెల్లూరులో కలపడం సంతోషకరమన్నారు. గత ఎన్నికల సమయంలో ఆమేరకు గూడూరు ప్రజలకు చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబు ఇచ్చిన హామీని నెరవేర్చినట్టయిందన్నారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు కూడా మొదటి నుంచి ప్రకాశం జిల్లాలో ఉండాలనే కోరుకున్నారని, వారి కోరికను కూడా ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరులో కొనసాగించడంతో పాటు..గూడూరు పట్టణం, గూడూరు, చిల్లకూరు, కోట మండలాలను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ప్రత్యేక ధన్యవాదాలని ఆయన అన్నారు.

# కొండ్లపూడి అభివృద్ధికి నిధులు

**• కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి**



నూతన తరగతి గదిని ప్రారంభిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొండ్లపూడి గ్రామానికి ఇప్పటికే 75 లక్షల రూపాయల నిధులను అభివృద్ధి పనులకు కేటాయించడం జరిగిందని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కొండ్లపూడి సంగం గిరిజనకాలనీలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన తరగతి గదికి డిసెంబరు 28న గిరిధర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండ్లపూడి సంగంలో తాను పర్యటించినప్పుడు, స్థానిక ప్రజలు, విద్యార్థులు స్కూల్ బిల్డింగ్ సమస్యను తెలిపారన్నారు. రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు దాతల సహకారంతో తరగతి గదిని త్వరితగతిన నిర్మించి, ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో సహకరిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో వైభవంగా వైకుంఠ ఏకాదశి




ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబరు 30న శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని శ్రీస్వామివారి కృపను పొందారు. శ్రీసిటీ సీఎఫ్‌వో ఆర్.నాగరాజన్, అకౌంట్స్ హెడ్ జనార్ధనరెడ్డి తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలో స్థానిక చిన్మయా విద్యాలయ పాఠశాల చిన్నారులు నిర్వహించిన భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీసిటీ ప్రతినిధులు పి.బి.శాస్త్రి, పల్లేటి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. శ్రీసిటీలో వైకుంఠ ఏకాదశి వైభవోపేతంగా జరగడం పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# బ్యాంకులు మరింతగా సహకరించాలి

**• విశ్వకర్మ పథకం సమీక్షలో.. బీఎంఆర్**




పార్లమెంటు పరిశ్రమలపై శాఖాపరమైన స్థాయి స్టాండింగ్ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబరు 29న ముంబైలో జరిగిన అధ్యయన పర్యటనలో ఆ కమిటీ సభ్యులైన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) పాల్గొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం అమలుపై మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం ముంబైలో బ్యాంకర్లతో నిర్వహించిన ఆ సమీక్ష సమావేశంలో విశ్వకర్మ పథకం ద్వారా సంప్రదాయ వృత్తిదారులు, హస్తకళాకారులు, చిన్నతరహా పనివారికి అందుతున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఆర్థిక సహాయం, రుణ సౌకర్యాలు, మార్కెటింగ్ మద్దతు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ పథకం అమలులో ఎదురవుతున్న సవాళ్లు, బ్యాంకు రుణాల మంజూరులో ఆలస్యాలు, అవగాహన లోపం వంటి సమస్యలను ఈ సందర్భంగా ఈ సమావేశంలో బీఎంఆర్ ప్రస్తావించారు. పథకం లక్ష్యాలను నెరవేర్చేలా బ్యాంకులు మరింత సహకార దృక్పథంతో వ్యవహరించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం విశ్వకర్మ పథకం దేశవ్యాప్తంగా లక్షలాది సంప్రదాయ వృత్తిదారులకు ఆర్థిక భరోసా కల్పించే కీలక పథకమని ఆయన అంటూ, దానిని పటిష్టంగా అమలు చేయాలని, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు ఇది దోహదపడుతుందని అన్నారు.

## కొచ్చిని సందర్శించిన పార్లమెంటరీ కమిటీ

పార్లమెంటరీ కమిటీ ఆన్ ఇండస్ట్రీస్ సభ్యులు నాలుగు రోజులు దేశంలోని వివిధ ప్రాంతాలలో గల ముఖ్యమైన పరిశ్రమలను సందర్శించేందుకు రాజ్యసభ సభ్యులు, కమిటీ ఛైర్మెన్ తిరుచ్చి శివ ఆధ్వర్యంలో ఇటీవల కొచ్చికి చేరుకున్నారు. కమిటీ సభ్యులైన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్ వివిధ సమావేశాల్లో కమిటీ సభ్యులతో కలసి పాల్గొన్నారు.







# పేదల అభ్యున్నతే.. ప్రభుత్వ లక్ష్యం

**మంత్రి నారాయణ**



వైకుంఠపురంలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ

పేదల అభ్యున్నతే తమ కూటమి ప్రభుత్వం లక్ష్యమని పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని 5వ డివిజన్ వైకుంఠపురంలో పర్యటించారు. వారం క్రితం ఈ ప్రాంతవాసులు ముంపు సమస్యను తన దృష్టికి తీసుకుని వచ్చారని.. ఇచ్చిన మాట ప్రకారం వారంరోజుల్లోనే అధికారులతో కలిసి వైకుంఠ పురంలో ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను తెలుసుకుని, వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. వర్షాల సమయంలో ఇక్కడ ముంపుకు గురయ్యే 22 ఇళ్లను గుర్తించామని..ఆ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన వివరించారు. కమిషనర్ నందన్, ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ పాల్గొన్నారు.

# పటిష్టంగా సేవలందించాలి

**- - - సివిల్ సప్లయిస్ డైరెక్టర్ గోవిందరావు - - -**

ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజల కోసం చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థను అధికారులు పటిష్టంగా నిర్వహించాలని పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ రోణంకి గోవిందరావు జిల్లాలోని అధికారులకు చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు రోడ్లు భవనాలశాఖ అతిథి గృహంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి రేషన్ దుకాణాలు, గ్యాస్ సరఫరా ఏజెన్సీల ద్వారా అందిస్తున్న పౌర సేవలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌షాపులను అధికారులు తరచుగా తనిఖీ చేయాలని సూచించారు. ఆర్డీవోలు కూడా షాపుల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేపట్టాలన్నారు.

# జనవరి 6న.. ఊరిమిండి ఉపన్యాసం

నెల్లూరులోని 'చేతన' సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వ ర్యంలో జనవరి 6వ తేదీన 'మన తెలుగు సిరిసంపదలు'..సాహిత్యంలో చమత్కారం..అనే అంశంపై సాహిత్య సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు స్థానిక టౌన్‌హాలు ప్రాంగణంలోని వర్ధమాన సమాజం వేదికపై జరిగే ఈ సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త డా. ఊరిమిండి నరసింహారెడ్డి (యుఎస్ఏ- డల్లాస్, టెక్సాస్) ప్రధానవక్తగా పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, విశిష్ట అతిథిగా కృష్ణపట్నం ఇమామి ఆగ్రోటెక్ వైస్ ప్రెసిడెంట్ ఎంవి నారాయణమూర్తి, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ మాటల రచయిత డా. పి.రాజేంద్రకుమార్(హైదరాబాద్) పాల్గొంటారని తెలిపారు. సాహిత్యాభిమానులందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా 'చేతన' నిర్వాహకులు డా. ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేష గిరీశం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## నెల్లూరు కబుర్లు

# నేను సైతం..జనం కోసం!..

**ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్**



ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

'నేను సైతం జనం కోసం.. నెల్లూరు నగరాభివృద్ధికి అండగా ఉంటా నంటూ నెల్లూరు నగర పాలక సంస్థ ఇంచార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు సిటీ నియోజకవర్గ కార్పొ రేటర్లు, కో-ఆప్షన్ సభ్యులతో ఆత్మీయ సమావేశాన్ని, కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వీడియో కాన్ఫరెన్స్‌హాలులో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ నారాయణ సూచనల మేరకు నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కార్పొరేటర్లతో చర్చించే దుకు, డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని కార్పొరేటర్లం దరికీ అనునిత్యం అందుబాటులో ఉంటానని, ఏ సమస్యనైనా ఉన్నతాధికా రులతో పాటు కమిషనర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్పొరేటర్లకు అందాల్సిన గౌరవం, మర్యాద, ప్రోటోకాల్ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని, డివిజన్ పరిధిలో జరిగే ప్రతి ఒక్క అభివృద్ధి పనిలో కార్పొరేటర్లకు సమాచారం అందించి వారి భాగస్వామ్యం ఉండేలా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని మేయర్ స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, కో-అప్షన్ సభ్యులు చాట్ల నరసింహారావు, షేక్ జమీర్, సిటీ నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్.. వ్యవస్థాపక దినోత్సవం



జెండా వందనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ పార్టీ 141వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నెల్లూరు ఇందిరాభవన్‌లో ఇటీవల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వ ర్యంలో జెండా వందనం నిర్వహించారు. జిల్లా కాం గ్రెస్ ఉపాధ్యక్షుడు బాల సుధాకర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసు కొచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ ప్రజల హృదయాలలో నిలిచిపోయిందన్నారు. కోవూరు కోఆర్డినేటర్ వేటూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సంజయ్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ రూరల్ కోఆర్డినేటర్ ఫయాజ్, రాజేష్, ధనుంజయ్ తదితరులు పాల్గొని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెచ్చేందుకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# హక్కులను పరిరక్షించుకోవాలి

దేశంలో ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని, వారు తమ హక్కులను పరిరక్షించుకోవాలని మేరా యువభారత్ జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మూలాపేటలోని వేద సంస్కృత ఉన్నత పాఠశాలలో జరిగిన 'జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినియోగదారులు తమ హక్కుల పరిరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు. యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్య నిర్వహ ణాధికారి ఎ. నాగేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు, సెట్నెల్ సూపరింటెండెంట్ మహ్మద్ గయాజ్, ప్రధానో పాధ్యాయులు వై.ఎన్.ఆర్.శర్మ పాల్గొన్నారు.



# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం..

# పాలకమండలి ప్రమాణస్వీకారం

నెల్లూరులోని ప్రసిద్ధమైన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఇటీవల అమ్మవారి ఆలయంలో వైభవంగా జరిగింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, తెలుగుదేశం నాయకుడు దొడ్డపనేని రాజానాయుడు, జనసేన నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్ రెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్‌బోర్డులో నియమితులైనవారు సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, దాతలు వచ్చినప్పుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. హోదాలు గుడి బయటే వదిలిపెట్టి భక్తుల సేవ, అమ్మవారి సేవలో ట్రస్టుబోర్డు వారు తరించాలన్నారు. తాను కూడా ఎమ్మెల్యే అనే హోదాని పక్కనపెట్టి, అమ్మవారి దేవస్థానంలోకి వస్తానన్నారు. 10మంది సభ్యులతో ట్రస్ట్ బోర్డు కమిటీని నియమించడం జరిగిందని, భక్తులపట్ల మర్యాదగా వ్యవహరించి అందరూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

# 'చెట్టు = తల్లి' షార్ట్‌ఫిల్మ్‌కి

# మరో రెండు..జ్యూరీ అవార్డులు



కళాంజలి అనంత్



ఉపేంద్ర ధీరజ్



సుఫియా

నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు..ప్రముఖ రచయిత-నటుడు-దర్శకుడు కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో రూపొందించిన 'చెట్టు=తల్లి' షార్ట్‌ఫిల్మ్‌కి మరో రెండు జూరీ అవార్డులు కూడా లభించాయి. తెలంగాణ, మంచిర్యాలలోని రవికిరణ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 'బాపూ-రమణ స్మారక షార్ట్‌ఫిల్మ్‌ల అవార్డుల పోటీ-2025'లో 'చెట్టు=తల్లి'కి ద్వితీయ ఉత్తమ అవార్డుతో పాటు, రచన-సంభాషణల రచయితగా కళాంజలి అనంత్ అవార్డును సాధించారు. ఆ రెండు అవార్డులతో పాటు, 'చెట్టు=తల్లి'లో నటించిన ఉపేంద్ర ధీరజ్, సుఫియాలకి కూడా జ్యూరీ అవార్డులు లభించాయి. ఈ పోటీకి మొత్తం 39 షార్ట్‌ఫిల్మ్‌లు రాగా, 'చెట్టు=తల్లి' షార్ట్‌ఫిల్మ్ ఒక్కటే నాలుగు అవార్డులు సాధించడం విశేషం. దీంతో అవార్డుల విజేతలని, చెటు=తల్లి బృందాన్ని పోటీల నిర్వాహకులు అభినందించారు.

# విద్యార్థులకు.. చక్రాల వారి ట్రస్ట్ చేయూత!

నెల్లూరులోని చక్రాల వారి ట్రస్ట్ ద్వారా ప్రతి ఏటా ఉన్నత కళాశాల పేద విద్యార్థులకు అందించే ఆర్థిక సహాయాన్ని ఇటీవల స్థానిక పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ ద్వారా అందజేశారు. ఆ సాయంతో పాటు అనుబంధ సంస్థ..స్వయంపాకుల వారి ట్రస్ట్ ద్వారా కూడా 36 మంది విద్యార్థులకు పదివేల రూపాయల వంతున 3 లక్షల 60 వేల రూపాయలు అందజేశారు. అదేవిధంగా, ఈసారి ముగ్గురు వేద విద్యార్థులకు కూడా శ్రీమతి చీమలమర్రి రాధా రాణి దంపతులు, ముక్కామల రామచంద్ర కళ్యాణి దంపతులు, పొత్తర్ల హర్ష శిల్పా దంపతులు సరస్వతి భట్ల వెంకటశేషయ్య-హైమవతి దంపతులు, యనమండ్ర సీతారామశాస్త్రి, స్వయంపాకుల రాధాకాంత్ దంపతులు, సురభి ప్రభాకర్ శాస్త్రి, ఆయత్తు వెంకట చంద్రశేఖర్‌ప్రభు, గన్నవరం ప్రభాకర్‌శర్మ తదితరులు వేద విద్యార్థులకు తమవంతు సాయం అందించారు. ధ్యానమందిరం కమిటీ అధ్యక్షులు బ్రహ్మశ్రీ గుండాపంతుల రామసుబ్రహ్మణ్యంశర్మ, గౌరవ అధ్యక్షులు బ్రహ్మశ్రీ పార గురు వెంకట శ్రీధర శర్మ, ఇందుకూరుపేట శ్రీ లలితా ఆశ్రమం పీఠాధిపతులు శ్రీ రామాయణం మహేష్‌స్వామి, ఇసుకపాలెం శ్రీ శృంగేరి శ్రీ భారతీ తీర్థ వేద పాఠశాల ప్రధాన అధ్యాపకులు బ్రహ్మశ్రీ దేవరకొండ నాగరాజ శర్మ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుడ్డదొన శ్రీనివాసరావు, స్వామి సమయానందనాథ తదితరులు పాల్గొన్నారు.




# ఏఐ కళ్ళద్దాలతో..
# అంధుల జీవితాలకు వెలుగు!

## • మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



అంధునికి ఏఐ కళ్ళజోడుని తొడుగుతున్న మంత్రి ఆనం, పక్కన బొల్లినేని కృష్ణయ్య, భాస్కర్‌రావు

పుట్టడంతోనే అంధత్వం ప్రాప్తించిన వారికి వరంగా..ఏఐ కళ్ళద్దాలు ఇప్పుడు అందుబాటులోకి వస్తున్నాయి. దాదాపు 80 నుండి 100 శాతం దృష్టిలోపం ఉన్న వారికి చూపు కనిపించేలా ఏఐ కళ్ళ జోళ్ళు అందిస్తూ తమ ఉదారతను చాటు కున్న కిమ్స్ ఫౌండేషన్ మరియు అచల గ్రూపు ప్రతినిధులను రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొని యాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల మండలం మాముడూరు జడ్పీ పాఠశాల ఆవరణలో ఇటీవల కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీచార్జ్ సెంటర్ మరియు అచల గ్రూప్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆనం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దాదాపు 30 వేల రూపాయల విలువైన ఏఐ కళ్ళజోళ్ళ పరికరాలను తొలివిడతగా నెల్లూరు జిల్లాలోని మాముడూరు గ్రామంలో 220 మందికి అందజేయడం విశేషమని, అంధత్వం కలిగిన వారికి ఎలాంటి సహాయకులు లేకుండా నేరుగా వారి పనులు చేసుకోవడానికి ఏఐ కళ్ళ ద్దాలు ఉపయోగపడతాయని అన్నారు. తొలుత తెలంగాణలోని హైదరాబాదులో ఆనాటి గవర్నర్ చేతుల మీదుగా 100 మందికి కళ్ళజోళ్ళు అందజేయడం జరిగిం దని, తదుపరి శ్రీకాకుళంలోనూ, ఇప్పుడు నెల్లూరుజిల్లా మాముడూరు గ్రామంలోను వాటిని అందజేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 2746 మంది అంధులకు ఏఐ బెస్ట్ స్మార్ట్ డిజైన్ గ్లాసులను అందించను న్నారని తెలిపారు.

### త్వరలో జిల్లావ్యాప్తంగా ఏఐ కళ్ళద్దాలు :

కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య మాట్లాడుతూ అంధులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కళ్ళజోళ్ళు అందజేయడం తమకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. అచల గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ రవితేజ ఏఐ కళ్ళజోళ్ళ పనితీరును వివరించారు. బొల్లినేని భాస్కరరావు, శ్రీనివాసులు, టి.గిరినాయుడు, ఆత్మకూరు రెవిన్యూ డివిజనల్ అధికారి పావని, ఐసిడిఎస్ పీడీ హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.

## సంగం శివాలయానికి మినరల్ వాటర్‌ప్లాంట్



కిమ్స్ హాస్పిటల్ ఫౌండేషన్ ద్వారా సంగం శివాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా భక్తులకి త్రాగు నీటి వసతిని కలుగజేశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం దీనిని ప్రారంభించారు.

# సూర్య ఘర్'..ఓ అద్భుత పథకం
## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి




ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ఓ అద్భుత పథకమని, దానివల్ల కాలుష్యం తగ్గడంతో పాటు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం కూడా గణనీయంగా తగ్గుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్లపై ఆంధ్రా ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ ఆధ్వర్యంలో ఇటీవల వెంకటాచలంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకానికి సంబంధించిన నిర్ణీత మొత్తంలో 10 శాతం చెల్లించి ఇళ్లపై సోలార్ యూనిట్ ఏర్పాటుచేసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 2కేవీకి రూ. 60 వేలు, 3 నుంచి 10 కేవీ వరకు రూ. 78 వేలు సబ్సిడీ లభిస్తుందని, 3 కేవీ యూనిట్ ధర రూ. 2.20 లక్షలు అనుకుంటే సబ్సిడీ రూ. 78 వేల వరకు లభిస్తుందన్నారు. మిగిలిన రూ. 1.42 లక్షల్లో రూ. 1.20 లక్షలు బ్యాంకు రుణం ఇస్తుందన్నారు. కేవలం రూ. 20వేల పెట్టుబడితో ఇళ్లపై 3కేవీ సోలార్ యూనిట్ బిగించుకోవచ్చని, ప్రతి నెలా 300 నుంచి 375 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, అయిదేళ్ల తర్వాత బ్యాంకు రుణం తీరిపోవడంతో పాటు ఇంటికి ఉచితంగానే విద్యుత్ లభిస్తుందన్నారు. 25 ఏళ్ల వరకు యూనిట్ పనిచేస్తుందని, సోలార్ విద్యుత్ వినియోగం పెరిగితే బొగ్గుతో ఉత్పత్తి తగ్గి కాలుష్య సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆంధ్రా ఎంటర్ ప్రైజెస్ కంపెనీ సర్వేపల్లి నియోజకవర్గంలో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు కూడా ముందుకొచ్చిందని, కంపెనీ ప్రతినిధులు ఇక్కడే ఉండి సర్వీసింగ్ కూడా అందిస్తామని చెబుతున్నారని, ప్రజలు ఆలోచించి సోలార్ యూనిట్లు ఏర్పాటుచేసుకుని ప్రయోజనాలు పొందాలని ఆయన వివరించారు.

# నరసింహస్వామికి నారాయణ పూజలు



పూజల్లో పాల్గొన్న మంత్రి నారాయణ దంపతులు

రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలు.. అష్టైశ్వర్యాలతో జీవితాలు సాగించాలంటూ రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరు సమీపంలోని నరసింహ కొండలో వెలసివున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని ప్రార్థించారు. డిసెంబరు 30న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన తన సతీమణి రమాదేవితో కలసి శ్రీస్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశిరోజున స్వామివారిని దర్శించుకోవడం తమకు ఆనవాయితీ అని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలన జయప్రదంగా కొనసాగాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. తొలుత, ఆలయ అర్చకులు మంత్రి నారాయణ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, దైవదర్శనం చేయించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఛైర్మెన్ అచ్యుత శంకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.










## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# సంక్షేమం, అభివృద్ధికే కూటమి పెద్దపీట

### - ఎమ్మెల్యే పాశం



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డా. సునీల్

కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. చిల్లకూరు మండలం, బూదనం సమీపంలోని జాతీయ రహదారి నుండి పున్నపువారిపాళెం ప్రాంతం వరకు 2 కిలోమీటర్లకు పైగా ఉపాధి హామీ నిధుల క్రింద 4కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ కమిటీ మాజీచైర్మెన్ తానంకి నానాజీతో కలిసి డిసెంబర్ 27న శంకుస్థాపన చేశారు. శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, ఏపీ లైవ్‌స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, గంటా మధుకృష్ణ, నాయకులు కీరవాణి, పట్టాభిరామిరెడ్డి, చిరంజీవి, జానకిరామిరెడ్డి, శ్రావణి, రహీమ్, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



హిందూ సమ్మేళన ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆహ్వాన సమితి సభ్యులు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశం మొత్తం నిర్వహించ తలపెట్టిన 'హిందూ సమ్మేళనం' కార్యక్రమం ఈ నెల 3న గూడూరులో జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఇటీవల గూడూరు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆహ్వాన సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మెన్ శ్రీకంటి రామమోహన్ రావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మురళీరెడ్డిలు మాట్లాడుతూ డాక్టర్ సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో జరుగనున్న హిందూ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ కమలా నందభారతి స్వామివారు విచ్చేస్తారని, గూడూరు పరిసర ప్రాంత హిందువులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన సమితి సభ్యులు జీవీఎస్ పవన్‌కుమార్, బి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున, సనత్‌కుమార్‌రెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, రామారావు, చెంచురామయ్య, ఎస్ఎల్ఎన్ స్వామి, దయాకర్, మనోహర్ పాల్గొన్నారు.



# అభినందన సత్కారం

నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు మేయర్ (ఇన్‌ఛార్జ్) పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్‌లకు ఇటీవల నెల్లూరు, సంతపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపి, సత్కరిస్తున్న దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి

# ముక్కోటి వేడుకల్లో..రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో వేడుకగా జరిగిన ముక్కోటి వేడుకల్లో వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి శ్రీచెన్నకేశవ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



## వైభవంగా..

# లక్ష తులసి పూజ

గూడూరు, రాజావీధిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోవిందమాల అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 27వ తేదీ శ్రీవారికి లక్ష తులసి పూజ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ అలఘునాథునికి

# పల్లకి సేవ



గూడూరులోని శ్రీశ్రీశ్రీ అలఘునాథ స్వామి దేవాలయంలో ధనుర్మాసం, ముక్కోటి ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 28న ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి అశోక్ ఆధ్వర్యంలో గోదాదేవి పూజ, పల్లకి సేవ జరిగాయి. డి.బి.శ్రీనివాసరావు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, కమిటీ మెంబరు కడివేటి రామమూర్తి, చిట్టమూరు శ్రీనివాసరావు దంపతులు, వి.నరసింహం తదితర భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఆలిండియా టెన్నిస్ మహిళా టోర్నీ విజేత తన్వీ




విజేతలకు బహుమతులందజేస్తున్న డా. సి.రోహిణి

గూడూరు నియోజకవర్గం, చిల్లకూరు మండలంలోని ఏ5 హోటల్ మూడు రోజుల పాటు నిర్వహించిన ఆల్ ఇండియా టెన్నిస్ మహిళా టోర్నమెంట్ ఇటీవల ముగిసింది. ఆంధ్రప్రదేశ్, చెన్నై, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి 32మంది టెన్నిస్ క్రీడాకారిణులు పాల్గొనగా, టోర్నీ విజేతగా తన్వీ దాసరి (కర్ణాటక), రన్నర్‌గా హోంనా యాదవ్(తెలంగాణ) నిలిచారు. విజేతలకు డా. రోహిణి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఏ5 హోటల్ అధినేత బద్రి గిరి, సుప్రభ పాల్గొన్నారు.

















## నెల్లూరు కలెక్టరేట్ వద్ద వామపక్షాల నిరసన

పర్యావరణాన్ని దెబ్బతీసే పరిశ్రమలు వద్దని, రాచర్లపాడు వద్ద ఇథనాల్ పరిశ్రమలు స్థాపించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరుతూ డిసెంబరు 29న నెల్లూరు కలెక్టరేట్ వద్ద సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. రాచర్లపాడు కిసాన్‌సెజ్‌లో ఇఫ్కో పరిశ్రమలు ఏర్పాటుచేసి, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఎంతో కాలం నుంచి కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇథనాల్ పరిశ్రమలు వద్దనే వద్దని వారు నినాదాలు చేశారు. వామ పక్షాలు, ప్రజాసంఘాల నాయకులు మూలం రమేష్, అరిగెల సాయి, సాగర్ తదితరుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.

## వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

సింహాచలంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములను పరిశ్రమలకు కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నెల్లూరు కలెక్టరేట్ వద్ద డిసెంబరు29న విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) వారి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న భూములను పరిశ్రమలశాఖకి అప్పగించడం సరికాదంటూ నాయకులు ఆందోళన చేశారు. ఇప్పటికే సింహాచలం దేవాలయ భూములు అనేకం అన్యాక్రాంతమయ్యాయని, ఆలయభూముల్లో ఇతరత్రా కట్టడాలు కట్టడం సముచితం కాదని అన్నారు. ఈ ఆందోళనలో వీహెచ్‌పీ నాయకులు ఏ.శ్రీధర్‌మోహన్‌రావు, బీజేపీ నాయకులు మిడతల రమేష్, రాజేంద్రప్రసాద్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఉన్న అధికారులకు అందజేశారు.

## ప్రభుత్వాల తీరు బాగా లేదంటూ.. సీఐటీయు ఆందోళన

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయంటూ కావలిలోని సీఐటీయు నాయకుల ఆధ్వర్యంలో డిసెంబర్ 30న ఆందోళన జరిగింది. కావలిలోని ఏరియా ప్రభుత్వాసుపత్రి కూడలి వద్ద నుంచి కార్మికులు, సీఐటియు కార్యకర్తలు పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు ప్రదర్శనగా వెళ్ళి తమ నిరసనలు తెలియజేశారు. సీఐటీయు కావలి పట్టణ ఉపాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. కార్మికులు ఎంతోకాలం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4వతేదీ వరకు విశాఖ పట్నంలో సీఐటియు నేతృత్వంలో అఖిలభారత స్థాయి 18వ మహాసభలు జరుగుతున్నాయని, జనవరి 4న కొత్త కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మహా ప్రదర్శన జరుగుతుందని, కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీఐటియు నాయకులు కృష్ణమోహన్, మధుసూదన్ రావు, ప్రజాసంఘాల నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.

## హెల్త్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించాలి

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అనేకమంది హెల్త్ అసిస్టెంట్లు 24 ఏళ్ల తర్వాత రెగ్యులర్ అయ్యారని, కొంతమంది రిటైర్ కూడా అవుతున్నారని, అయితే నేటికీ వారికి ఉద్యోగోన్నతి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఈ సమస్యను వెంటనే పరిశీలించి వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని ఆయన కోరారు.

# తంటాలు తెస్తున్న.. తారల మాటలు




సినీ తారలు సమాజంపై చూపే ప్రభావం అపారం. వారు వేసుకునే దుస్తులు ఫ్యాషన్ అవుతాయి, వారు మాట్లాడే మాటలు నినాదాలు అవుతాయి. కొన్నిసార్లు ఆ మాటలు వివాదాలు కూడా అవుతున్నాయి. ఇటీవల కాలంలో తెలుగు, భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సెలబ్రిటీలు తమ సినిమాల కంటే వివాదాస్పద వ్యాఖ్యల ద్వారానే హెడ్‌లైన్‌లలో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో యుద్ధాలకి కారణమవుతున్నారు. సినిమా తారలు కేవలం వెండితెరపై మెరిసే నటులు మాత్రమే కాదు, వారు కోట్ల మందికి రోల్‌మోడల్స్. వారు ధరించే దుస్తులు, పాటించే జీవనశైలి, మాట్లాడే మాటలు సమాజంలోని యువతపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. అయితే, దురదృష్టవశాత్తూ ఇటీవలి కాలంలో సెలబ్రిటీలు తమ వృత్తిపరమైన ప్రతిభ కంటే వివాదాస్పద వ్యాఖ్యల ద్వారానే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. ఇది ఒక ఆందోళనకరమైన సామాజిక ధోరణిగా మారుతోంది.

90's మిడిల్ క్లాస్ బయోపిక్ వెబ్‌సిరీస్, కోర్టు సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్స్‌ను ఘనంగా ప్రారంభించిన నటుడు శివాజీ ఇటీవల దండోరా చిత్ర ప్రమోషన్స్ సందర్భంగా మహిళల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. మహిళలు నిండుగా బట్టలు వేసుకోవాలని, లేదంటే వేధింపులకు గురవుతారని ఆయన చేసిన విశ్లేషణ తీవ్ర విమర్శలకు దారితీసింది.

హైదరాబాదులోని ఒక మాల్‌లో నటి నిధి అగర్వాల్‌కు ఎదురైన చేదు అనుభవాన్ని ప్రస్తావిస్తూ ఆమె దుస్తుల వల్లే అలా జరిగిందని అనడం, తప్పు చేసిన వారి ప్రవర్తనను సమర్థించినట్లుగా ఉందని మహిళా సంఘాలు మండిపడ్డాయి. సినీ పరిశ్రమలోని పలువురు వ్యక్తులు ఆయనను తప్పుపట్టారు. మహిళా కమిషన్ సమన్లు జారీ చేసి వివరణ కోరింది.

సెలబ్రిటీలు తమ వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించే క్రమంలో తమ పరిధులను గుర్తించడం లేదు.

కేవలం శివాజీ మాత్రమే కాదు, పలువురు సెలబ్రిటీలు తమ బాధ్యతారాహిత్య ప్రవర్తనతో వివాదాల్లో చిక్కుకుంటున్నారు. కొన్నేళ్ళ క్రితం బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్.. ప్రధాని భద్రతపై చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ నటుడు సిద్ధార్థ్ చేసిన ద్వంద్వార్థ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. ఇది చివరకు మహిళా కమిషన్ వరకు వెళ్లి, ఆయన బహిరంగ క్షమాపణ చెప్పేలా చేసింది. ఇక మరో నటుడు ప్రకాష్‌రాజ్ నిత్యం రాజకీయాలు, మత విశ్వాసాలపై ఏదో ఒక వ్యాఖ్య చేస్తూ వివాదానికి కేంద్రబిందువుగా నిలుస్తున్నారు.

'కాంతార' దైవ నృత్యాన్ని వెక్కిరించేలా రణవీర్ సింగ్ అనుకరించడంతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. సెలబ్రిటీలు వివాదాల్లో చిక్కుకోవడానికి ప్రధానంగా "అటెన్షన్ సీకింగ్" (ప్రచారం కోసం ఆరాటం) ఒక కారణమైతే, మారుతున్న సమాజపు ఆలోచనలను గుర్తించకపోవడం మరొక కారణం. అప్రమత్తత లోపించడం కూడా ఒక కారణం.

**డిజిటల్ ఫుట్‌ప్రింట్ :** ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్న ఈ రోజుల్లో ఏ చిన్న తప్పు చేసినా అది రికార్డ్ అవుతుందనే కనీస స్పృహ సెలబ్రిటీలకు ఉండటం లేదు.

**ప్రచార యావ :** కొన్నిసార్లు కావాలనే వివాదాస్పదంగా మాట్లాడి తమ సినిమాకు పబ్లిసిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నాలు కూడా కనిపిస్తున్నాయి.

తరం అంతరం : పాత తరానికి చెందిన వారు నేటి తరం ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోకుండా తమ పాత విలువలను పాటించాలని సూచించటం వల్ల కూడా వివాదాలు తలెత్తుతున్నాయి.

సోషల్ మీడియా వల్ల సెలబ్రిటీలకు, సామాన్య ప్రజలకు మధ్య దూరం తగ్గిపోయింది. ఒకప్పుడు సెలబ్రిటీలు ఏం చెప్పినా అది చెల్లుబాటు అయ్యేది. కానీ, ఇప్పుడు ప్రతి చిన్న మాటకూ నెటిజన్లు జవాబుదారీ తనం కోరుతున్నారు. చిన్న పొరపాటు చేసినా వేల సంఖ్యలో ట్రోల్స్ ఎదుర్కోవాల్సి వస్తోంది.

పదేళ్ల క్రితం చెల్లుబాటయిన మాటలు లేదా, ఆధిపత్య ధోరణులు నేటి తరం సహించడం లేదు. ముఖ్యంగా లింగ సమానత్వం పట్ల పెరుగుతున్న అవగాహన వల్ల సెలబ్రిటీల ప్రతి మాటా విశ్లేషణకు గురవుతోంది.

సెలబ్రిటీకి ఉండే 'ఇన్ఫ్లుయన్స్' వల్ల వారు మాట్లాడే మాటలు వివాదాలకు ఊతం ఇచ్చేలా ఉండకూడదనే కనీస అవగాహన లోపిస్తోంది. సెలబ్రిటీ హోదా అనేది కేవలం డబ్బు, కీర్తి మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత. పెద్దఎత్తున అభిమానులు ఉండటంతో తాము ఏదో గొప్ప స్థానంలో ఉన్నామన్న భ్రమలో ఏది మాట్లాడినా చెల్లుబాటవుతుందన్న అపరిపక్వ ఆలోచన ధోరణితో కొంతమంది సెలబ్రిటీలు ఉన్నారు. తమ పరిమితులను గుర్తిస్తూ మాట్లాడితే వివాదాలకు తావు ఉండదు. ప్రజల దృష్టి ఎప్పుడూ వారిపైనే ఉంటుంది. కాబట్టి, వారు మాట్లాడేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. సెలబ్రిటీలు తమ అభిప్రాయాలను గౌరవప్రదమైన భాషలో చెప్పడం నేర్చుకోవాలి. ముఖ్యంగా మహిళా సాధికారత, మతపరమైన అంశాలు, సామాజిక మర్యాదల విషయంలో వారు 'రోల్ మోడల్స్'గా ఉండాలి తప్ప, వివాదాలకు కేంద్ర బిందువులుగా మిగిలిపోకూడదు.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# యువతకి స్ఫూర్తిదాయకం.. క్రీడాపోటీలు

క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి చెప్పారు. నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఇటీవల 'మేరా యువ భారత్ స్వయంకృషి రూరల్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ' సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు జరిగాయి. మహేంద్రరెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పాండురంగ, బాలల సంరక్షణ సంస్థ అధికారి సురేష్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలైన క్రీడాకారులకు బహుమతులందజేసి అభినందించారు.

ఈ పోటీల్లో ఖో–ఖో విభాగంలో డీకే మహిళా కళాశాల జట్టు విజేతగా నిలవగా, వాలీబాల్ విభాగంలో పొదలకూరు భారత్ టీమ్ విజయం సాధించింది. షాట్‌పుట్ మహిళల విభాగంలో సాయి ప్రసన్న, ఝాన్సీ రాణి, షేక్ కరిష్మా విజేతలుగా నిలవగా, పురుషుల విభాగంలో అఫ్రోజ్, చెన్నకేశవులు, ఇబ్రహీం గెలుపు సాధించారు. 100 మీటర్ల పరుగు పందెంలో మహిళల విభాగంలో షేక్ కరిష్మా, నిర్మల మేరీ, శ్రీనిధి.. పురుషుల విభాగంలో నిఖిల్, ప్రవీణ్, పూర్ణ విజేతలుగా నిలిచారు. విజేతలందరికీ మేరా యువ భారత్ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు.

# జ్వలన కాంక్ష



**చిన్ని నారాయణరావు**
**94402 02942**

**ఆమె –**
గంజాయి రంగు పులుముకొంది
జగతిని మత్తులో ముంచెత్తి
తూనీగలా ఎగిరిపోవాలనుకొంది
దమననీతితో రాజకీయ రణోద్వేగ
సామ్రాజ్యాధిరోహణా పర్వం సృష్టించింది
అంతులేని జనం వ్యధే ఆమె కథ
మారణకాండతో చలిమంటలు వేయగల
నేరసామ్రాజ్య మహారాజ్ఞి
త్రాచుపామై విషం చిమ్మింది
కత్తిపోట్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా
కాలు దూసింది.

మరో మహిళ –
సెటిల్‌మెంట్ల పరాక్రమంలో
శివాలెత్తి కత్తుల కరవాలాలతో
అమానవీయ అరాచక సేద్యంతో
దమనకాండను ప్రేరేపించింది
స్త్రీలోని సహజ మార్దవానికి చెల్లుచీటీ రాసి
అంతులేని దాష్టీకం ప్రదర్శించింది
తాటకిలా మారి
జనం తలల జెండాలెగురవేసింది.

ఈ వికృత సామ్రాజ్య మదోన్మత్తులు
ఇద్దరు మహిళామణులు!
ప్రశాంత నెల్లూరును భగ్నం చేస్తున్న
సుడిగుండాల వికృత రూపాలు
దురన్యాయాన్ని నెత్తికెత్తుకొన్న
క్షుద్రత్వ శాపాలు

ఈ విస్ఫులింగాగ్ని విలనీని సృష్టించడంలో
బుల్లితెర ఓ అగ్నిగోళమైంది
నేరత్వానికి మంగళహారతులిస్తున్నది
'రాజకీయ' సామ్రాజ్యం
విచ్ఛిన్న పాటవంతో ఆక్టోపస్‌లను
సృష్టించడం మరొక విభ్రమం.

ఆమెలోని మానవతా దీపాల్ని
మట్టుబెట్టి
వికృత చేష్టల విఘాతాల్ని పెంచి
పోషిస్తున్నవి
సింహపురి యమపురిగా మారి
మసకబారిపోతున్నది.

# కోవూరులో..నూరు కోట్లతో.. అభివృద్ధి పనులు

**- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

కోవూరు నియోజకవర్గంలో నూరు కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఇటీవల నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారధ్యంలో రాష్ట్రం ప్రగతిబాట పట్టిందని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలవుతూ సుపరిపాలన సాగుతోందని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేష్‌ల నాయకత్వంలో ప్రజల అభ్యున్నతికి అనేకరకాలైన పథకాలు అమలులోకి వచ్చాయన్నారు. అన్నదాత సుఖీభవ, దీపం, మెగా డీఎస్సీ, తల్లికి వందనం, స్త్రీశక్తి, లబ్దిదారులకు పింఛన్లు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా, ధాన్యం సేకరించిన 24 గంటలలోనే రైతుల ఖాతాలో నగదు జమచేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. 1వ తేదీ ఆదివారం అయినప్పటికీ, అవ్వ తాతలకు డిసెంబరు 31వ తేదీనే..ఒకరోజు ముందుగానే పెన్షన్ డబ్బులు వారి ఇళ్లకు వెళ్లి అందచేయడం తొలిసారిగా కూటమి ప్రభుత్వంలోనే జరుగుతోందన్నారు.



'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కార్యకర్తలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

### కార్యకర్తలను విస్మరించేది లేదు

పార్టీజెండా మోసిన కార్యకర్తలను తాము ఏనాటికీ విస్మరించేది ఉండదని ప్రశాంతమ్మ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా, ఆపద కలిగినా ఆదుకునేందుకు తామున్నామంటూ భరోసా ఇచ్చారు. కార్యకర్తల బాధలు, పార్టీకోసం వారు పడిన కష్టాలు, చేసిన త్యాగాలు అన్నీ తమకు బాగా తెలుసన్నారు. తాము కొత్తగా రాజకీయాల్లోకి వచ్చినా తమ విజయానికి సహకరించిన కార్యకర్తలు, నాయకులకు, ఆశీర్వదించిన ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చిరెడ్డిపాళెం వ్యవసాయ బ్యాంక్ అధ్యక్షులు ఏటూరి శివకృష్ణా రెడ్డి, పవ్వేరు బ్యాంక్ ఛైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మి, టిడిపి ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజుల పాటు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

**జిల్లాలో ప్రారంభించిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**










కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనతో ప్రతి యేటా నిర్వహించే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జనవరి 1 నుండి 31వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ భద్రతా మాసోత్సవాలకి సంబంధించిన బ్యానర్లని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. జనవరి 1, గురువారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ రవాణాశాఖాధికారి బి.చందర్‌తో పాటు ఇతర రవాణా శాఖాధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయండి

జిల్లాలో గృహనిర్మాణశాఖ అధికారులు బాధ్యతగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉగాదిలోగా ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించారని, ఆ మేరకు జిల్లాకు కేటాయించిన 27820 ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తిచేసేందుకు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏజెన్సీల కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించాలన్నారు. ఏఈలు, డిఇలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన నాణ్యతా ప్రమాణాలు లేని ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్ల చేత సరిచేయించి వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పూర్తయిన ఇళ్లను లబ్దిదారులకు అప్పగించాలన్నారు. ఇళ్లల్లో చేరిన లబ్దిదారులకు ప్రభుత్వం అవసరమైన అదనపు సహాయాన్ని చేస్తుందన్నారు.

## మర్యాదపూర్వక కలయిక

- **వేమిరెడ్డి దంపతులను కలిసిన బీద, చేజర్ల**



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బీద రవిచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలు నెల్లూరులోని విపిఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వేమిరెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి సమర్థవంతంగా కృషి చేయాలని, అందుకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని వేమిరెడ్డి దంపతులు వారికి తెలిపారు.

## 'అపోలో'లో అరుదైన చికిత్స




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

వైద్యరంగంలో మారుతున్న చికిత్సా విధానాలకు అనుగుణంగా నూతన వైద్య పరికరాలతో అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్. తాజాగా స్థానిక అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలోని వైద్యులు ఇటీవల ఓ వ్యక్తికి అరుదైన వైద్య చికిత్సచేసి ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన ఆ వైద్యచికిత్సను తొలిసారిగా నెల్లూరులోని అపోలో బృందం విజయవంతంగా నిర్వహించడం విశేషం. ఆ వివరాలను ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్రావణిరెడ్డి డిసెంబరు 31న విలేకర్లకు వివరించారు. కావలికి చెందిన నాగరాజు(37)కి నోటి నుండి ఆగకుండా తీవ్రమైన రక్తస్రావం అవుతుండగా, వారి కుటుంబసభ్యులు తమ ఆసుపత్రికి తీసువచ్చారని, వైద్య పరీక్షలు నిర్వహించగా ఊపిరితిత్తులకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు ఓ చోట ఉబ్బి ఉండటమే కాకుండా, రంధ్రం కూడా ఏర్పడి ఉన్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. అందువల్ల ఊపిరి తిత్తులకు చేరాల్సిన రక్తం బయటకు వస్తూ, ఆ రక్తం నోటి గుండా కూడా బయటకు వస్తున్నట్లు గుర్తించారు. బ్రాంకిల్ ఆర్టీ ఎంబోలైజేషన్ అనే అరుదైన వైద్యవిధానం ద్వారా ఆ వ్యక్తికి చికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టామన్నారు. ఈ విధానం ద్వారా.. ఎక్కడైతే రక్తనాళానికి రంధ్రం పడిందో, అక్కడ కాయిన్‌ను అమర్చి నోట్లో నుండి వస్తున్న రక్తస్రావాన్ని నివారించామన్నారు. చికిత్సా విధానం విజయవంతంగా సాగిందని, ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ డాక్టర్ బిందు భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెనాలి రామకృష్ణుని కవితా శైలి అమోఘం

- **వేద విజ్ఞాన వేదిక సభలో డా. ఊరిమిండి**



ఊరిమిండి నరసింహారెడ్డిని సత్కరిస్తున్న వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, సి.ఎం.కె.రెడ్డి తదితరులు

అష్టదిగ్గజకవుల్లో అగ్రగణ్యులైన మహాకవి తెనాలి రామకృష్ణుని కవితా శైలి అమోఘమని, సరళమైన పదాలతోనే లోతైన భావాన్ని ప్రకటించడంలో ఆయన కాయనే సాటి అని ప్రముఖ సాహితీవేత్త, భాషా పరిశోధకులు, యుఎస్ఏ శంకర నేత్రాలయ పాలకమండలి సభ్యులు డా. ఊరిమిండి నరసింహారెడ్డి (డాలస్, టెక్సాస్) కొనియాడారు. డిసెంబర్ 28న చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తర తరాల తెలుగు కవిత ఉపన్యాస ధారా వాహికలో భాగంగా 168వ ప్రసంగ కార్యక్రమం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డా. ఊరిమిండి పాల్గొని 'విజయనగర వికటకవి తెనాలి రామకృష్ణ కవి సాహిత్య సౌరభం' అనే అంశంపై ప్రసంగించారు. వికటకవి అనే బిరుదు కేవలం హాస్యానికి మాత్రమే పరిమితం కాదని, ఆ హాస్యం వెనుక అపారమైన బుద్ధికుశ లతలు, తర్కశక్తితో పాటు సామాజిక స్పృహ నిండి ఉన్నాయని ఆయన అన్నారు. రాయలవారి సభలో చాటు పద్యాల ద్వారా, చమత్కార సంభాషణల ద్వారా తెనాలి రామకృష్ణ కవి ప్రదర్శించిన అద్వితీయ కవితా చాతుర్యం అనన్య సామాన్యమన్నారు. తెలుగు సాహిత్యంలో ఆ మహనీయుని స్థానం ఏనాటికీ చెరగనిదని అంటూ.. ఈ సందర్భంగా ఆ మహాకవి రచించిన 'పాండురంగ మహత్యం', 'ఘటికాచలమహాత్యం', 'ఉద్భటారాధ్య చరిత్ర' వంటి రచనల వైశిష్ట్యాన్ని ఆయన ఈ సందర్భంగా అద్భుతంగా వివరించారు. అనంతరం, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు.. తమిళనాట మన తెలుగు తేజం..ఆచార్య సీఎంకె రెడ్డి, వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకేరెడ్డి, కందనూరు మధు, ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, టీటీడీ స్థానిక సలహామండలి పూర్వాధ్యక్షులు ఆనంద్‌కుమార్‌రెడ్డి తదితరులు ప్రధాన వక్త అయిన డా. ఊరిమిండిని శాలువ –జ్ఞాపికలతో సన్మానించారు.

# మన భాషా సాహిత్యాలే.. మన 'సిరి సంపదలు'

## 'లాయర్' ఇంటర్వ్యూలో.. డా. యు.నరసింహారెడ్డి (యుఎస్ఏ)

***మన అద్వితీయమైన భాషా సాహిత్యాలే మనకు శాశ్వతమైన సిరిసంపదలని ప్రముఖ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ నిపుణులు, శంకర నేత్రాలయ యుఎస్ఏ పాలకమండలి సభ్యులు.. తెలుగు భాషా సాహిత్యాభిమాని.. ముఖ్యంగా మన నెల్లూరీయులు డా. ఊరిమిండి నరసింహారెడ్డి(డాలస్, టెక్సస్) చెప్పారు. ఇటీవల ఆయన అమెరికా నుంచి నెల్లూరుకి వచ్చిన సందర్భంగా.. దేశవిదేశాల్లో ఆయన చేస్తున్న విద్యా-సాహిత్య మరియు సేవారంగాల ప్రస్థానం గురించి వివరిస్తూ 'లాయర్' పత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అమెరికాలో ఉంటూ కూడా, జన్మభూమి అయిన భారతదేశాన్ని ఏమాత్రం విస్మరించకుండా, మాతృదేశానికి.. మాతృభాషకి నేటికీ తనవంతు సేవలందిస్తూనే ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యా, సాహిత్య రంగాలకి ఆయన చేస్తున్న కృషి.. సేవలు అద్భుతం..అపారం!.. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల నెల్లూరుకు వచ్చినప్పుడు 'లాయర్' ప్రతినిధితో మాట్లాడారు. ప్రత్యేకించి దేశవిదేశాల్లో విద్యార్థుల భవితవ్యానికి ఆయన మార్గదర్శనం చేస్తున్నారు. ఆ వివరాలన్నీ..ఆయన మాటల్లోనే!..***

మా స్వస్థలం నెల్లూరుజిల్లా ఆత్మకూరు సమీపంలోని పొంగూరు గ్రామం. తల్లి తండ్రులు వెంకటనరసారెడ్డి -సీతమ్మ గార్లు. వారికి నేను నాల్గవ సంతానం. చిన్నతనంలో పొంగూరులో ప్రాథమిక విద్య, అనంతరం కొడిగినహళ్ళి గురుకుల పాఠశాలలో చదువుకున్నాను. 10వ తరగతిలోనే రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు రావడం ప్రభుత్వపరంగా కూడా నాకెంతో గుర్తింపు తెచ్చింది. ఆతర్వాత విజయవాడ లయోలా కళాశాల, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, కాన్పూర్ ఐఐటీల్లో ఉన్నత చదువులు చదువుకుని, స్వయంకృషితో ఎదిగాను. 35 ఏళ్ళ క్రితం అమెరికాకి వెళ్ళి అక్కడ పీహెచ్‌డీ ఎంబీఏ పూర్తిచేసి, అక్కడే ఉద్యోగంలో స్థిరపడ్డాను. ప్రస్తుతం టెక్సస్ లోని డాలస్‌లో ఉంటూ, గత ఏడేళ్లుగా అమెరికా లోని అతిపెద్ద టెలికమ్యూనికేషన్స్ సంస్థ 'వెరైజన్'లో పనిచేస్తున్నాను. విద్యమీద ఉన్న మక్కువతో, విద్యార్థులకు మరింత ప్రేరణ ఇవ్వాలనే సత్సంకల్పంతో ఇటీవలే నా 5వ పట్టా 'ఉన్నత విద్యారంగం'లో అందుకున్నాను.

### మాతృభాషపై మమకారం :

జన్మభూమి అన్నా, మాతృభాష అన్నా నాకెంతో మమకారం. చిన్నతనం నుంచే మన భాషా సాహిత్యాలపై మక్కువ ఎక్కువ. అమెరికాలో ఉన్నా కూడా, అనేక దేశాల విద్యార్థులు, సాహితీకారులకు స్ఫూర్తిదాయకంగా ఉంటూ నిరంతరం ఎన్నో కార్యక్రమాలలో పాల్గొంటూ నిర్వహిస్తూనే ఉన్నాను. అమెరికాలో ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఆచార్యునిగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తూనే, ప్రతి సంవత్సరం డిసెంబరు మాసంలో భారత్‌కి వచ్చి ఇక్కడ విద్యార్థులకు అవసరమైన సూచనలు, విద్యలో మెళకువలు అందిస్తూ ఉన్నాను. మన జీవితం కోసం మన మాతృభాషను చదువుకోవాలి. జీతం కోసం పరభాషలను కూడా నేర్చుకోవాలి. అయితే, ఎన్ని భాషలు నేర్చుకున్నా మన మాతృభాషని మాత్రం మరచిపోకూడదు. నేను విద్యార్థులకు ఇదే పదేపదే చెప్తుంటాను. గత ఆరేళ్ళుగా భారత్ మరియు అమెరికా విద్యార్థుల కోసం 'విద్యాధనం: విద్యా ధనమూలమిదం జగత్' అనే రేడియో కార్యక్రమం ద్వారా విద్యలో మెళకువలు నేర్పుతున్నాను. రెండవ రేడియో కార్యక్రమం ద్వారా భారత్ ప్రపంచానికి అందించిన ప్రాచీన శాస్త్రాలను చదివి, అర్థం చేసుకుని, విద్యార్థుల భవితకు మేలుబాటలు వేస్తున్నాను. ఇకపోతే, భాషా సాహిత్యాల సేవలో భాగంగా, గత 91 నెలలుగా అమెరికాలో 'మన తెలుగు సిరిసంపదలు' అనే కార్యక్రమం చేపట్టి, మన తెలుగు భాషలోని చమత్కారాలు, పద్యాలు, ప్రహేళికలు, పదబంధాలు వగైరాల పట్ల కూడా అందరికీ ఆసక్తిని కలిగించేలా అనేక కార్యక్రమాలు చేపట్టాను. ముఖ్యంగా నేటి గ్రంథాలతో పాటు.. ప్రాచీన శాస్త్రాల అధ్యయనం కూడా నేటి సాహితీకారులకు ఎంత ముఖ్యమో అవగాహన కలిగిస్తున్నాను.



### మానవీయ సేవలతోనే జీవితానికి సార్థకత :


అన్నిటికన్నా మిన్నగా, మానవీయ సేవలతోనే జీవితానికి సార్థకత ఏర్పడుతుందనేది నా నమ్మకం. ఎవరైనా సరే మానవీయతత్వంతోనే జీవించాలి. అందుకే శంకరనేత్రాలయ యుఎస్ఏ సంస్థ పాలకమండలిలో సభ్యునిగా ఉంటూ గత ఆరేళ్ళుగా భారత్‌లో సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు 'మొబైల్ ఆసుపత్రి' ద్వారా అవసరమైన కంటిచూపు ఇప్పించడానికి నావంతు సేవలందిస్తున్నాను. ఈ సందర్భంగా విద్యార్థులకు నేనిచ్చే సందేశం ఒకటే..ప్రతిఒక్కరూ ఏదో చదువుకున్నాం.. ఉద్యోగం చేసుకుందాం అని కాక, జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకుని చదువుకోవాలి. సమయపాలనతో, క్రమశిక్షణతో చదువుకోవాలి. జీతం కోసమే కాక.. ఎంతో అమూల్యమైన జీవితం కోసం.. ఉన్న తాశయాలతో జీవితం సాగించడం కోసం లక్ష్యాత్మకంగా శ్రమించాలి.

అందుకు, ఎవరిపైనో ఆధారపడక.. ప్రతి విద్యార్థీ తనకు తానే.. తనదైన అవగాహనతోనే ముందుకు సాగాలి. అప్పుడే సమున్నతమైన విజయాలను కూడా మనం అవలీలగా సాధించడానికి మార్గం సుగమం అవుతుంది.

---

# విలనిజంలో అగ్రగణ్యులు.. మన రాజనాల

**రా**వణుడు లేని రామ కథ వినపడదు.. కంసుడు లేని కృష్ణ లీల కనపడదు. దుష్టపాత్ర లేకపోతే హీరో పాత్ర లేదు. ఎన్టీఆర్, కాంతారావులతో కత్తి యుద్ధాలు చేసినా, తన కంచు కంఠంతో గుండమ్మను బెదిరించినా, హనుమంతుని పాత్రలో ఔరా అనిపించినా, మాంత్రికుడి పాత్రలో మెప్పించినా.. ఇలా ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి ప్రేక్షక జననీరాజనాలు అందుకున్న విలక్షణ ప్రతినాయకుడు, మన సింహపురి నట కౌశలం 'రాజనాల'. నటసార్వభౌమ నందమూరి తారక రామారావుచే ఆప్యాయంగా 'మామాజీ' అని పిలిపించుకున్న విలక్షణ నట చక్రవర్తి మన 'రాజనాల'. విఠలాచార్య చిత్రాలకు ప్రాణంపోసి అఖండ సిరిని సృష్టించిన నటుడు మన రాజనాల. నాలుగక్షరాల రాజనాల వెండితెరపై నాలుగు దశాబ్దాల పాటు 1400 చిత్రాల్లో తనదైన నటన సాగించి, అందరి ప్రశంసలందుకున్నారు. హాలీవుడ్ చిత్రంలో నటించిన తొలి తెలుగు నటుడుగా రాజనాలకు గుర్తింపు ఉంది. రాజనాలకు నటన వృత్తి అయితే.. పుస్తక పఠనం ప్రవృత్తి.






### జన్మస్థలం కావలి

'రాజనాల' పూర్తి పేరు రాజనాల కాళేశ్వర రావు నాయుడు. సుబ్బమ్మ, వెంకట నారాయణయ్య రాజనాల తల్లిదండ్రులు. 1925 జనవరి 3 వైకుంఠ ఏకాదశి రోజున జన్మించారు. వీరు ఐదుగురు అన్నదమ్ములు, నలుగురు అక్కచెల్లెళ్ళు. వీరి స్వస్థలం నెల్లూరుజిల్లా కావలి పట్టణం. వీరి ప్రాథమిక విద్య కావలిలో సాగింది. పదేళ్ల వయసులో ఉండగా జబ్బునపడడంతో బడి మానేశాడు. కొన్నేళ్ల తర్వాత తిరిగి బడిలో చేరి చదువుకున్నాడు. రెవిన్యూ శాఖలో ఉద్యోగం పొందాడు. ఉద్యోగం చేస్తున్నా నాటకాలు వేసేవాడు. ఈయనకు ఇద్దరు కుమారులు.

### నాటక సంఘం స్థాపన

నెల్లూరుకు చెందిన మిత్రుడు లక్ష్మీకుమార్‌రెడ్డితో కలిసి నేషనల్ ఆర్ట్ క్రియేషన్స్ నాటక సంస్థను స్థాపించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండగానే ఆచార్య ఆత్రేయ రచించిన 'ఎవరు దొంగ' అనే నాటకాన్ని మొట్టమొదటిసారిగా నెల్లూరు పురమందిరంలో ప్రదర్శించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ప్రభుత్వ కార్యకలాపాలను ఎత్తిచూపే ఈ నాటికతో ఆయనకు మంచి క్రేజ్ వచ్చింది. నాటిక ద్వారా ప్రభుత్వ విధానాలు ఎండగట్టడంతో సస్పెండ్ అయ్యారు. కొద్దిరోజుల తర్వాత తిరిగి ఉద్యోగంలో చేరినప్పటికీ మరొక నాటకం 'ప్రగతి' కూడా ప్రభుత్వాన్ని విమర్శించే విధంగా ఉండడంతో తిరిగి సస్పెన్షన్ ఎదుర్కొన్నారు. చివరకు ఉద్యోగాన్ని వదిలివేసి సినీ రంగం వైపు అడుగులు వేశారు.

### సినీ ప్రస్థానం

తెలుగు చలనచిత్ర పితామహుడు హెచ్.ఎం.రెడ్డి (హనుమప్ప మునియప్ప రెడ్డి) దర్శకత్వం వహించిన 'ప్రతిజ్ఞ' రాజనాల తొలి చిత్రం. కాంతారావు, సావిత్రి ఈ సినిమా ప్రధాన పాత్రధారులు. రాజనాలది విలన్ పాత్ర. తొలి చిత్రం ఆయనకు మంచిపేరు తెచ్చిపెట్టింది. తర్వాత 'వద్దంటే డబ్బు' అనే సినిమాలో ఎన్టీఆర్‌కు మామగా ముసలి జమీందారు పాత్రలో నటించారు. అప్పటి నుంచి వారి మధ్య మంచి స్నేహం చిగురించడంతో ఎన్టీఆర్ ఆయనను ఆప్యాయంగా 'మామాజీ' అని పిలిచేవారు. 1960, 70, 80 దశకాల్లో హీరోకి దీటుగా పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక చిత్రాలలో నటించారు. హీరోలతో సమానంగా పారితోషికం అందుకున్నారు. తెనాలి రామకృష్ణ, వినాయక చవితి, సువర్ణ సుందరి, జగదేకవీరుని కథ, గులేబకావళి కథ, నర్తనశాల, రాముడు భీముడు, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, అవేకళ్ళు వంటి 1400 చిత్రాలలో ఆయన నటించి మెప్పించారు. నాగార్జున హీరోగా నటించిన హలో బ్రదర్ ఆయన చివరి చిత్రం. ఆయన విఠలాచార్య సినిమాలలో మంత్రదండం పట్టి మాంత్రికుడి వేషం వేసినా, రామారావు, కాంతారావులతో కత్తి యుద్ధం చేసినా, గదాధారియై ఆంజనేయస్వామి వేషం వేసినా, కనుబొమ్మలు పైకి ఎగరేసి కంటితోనే డైలాగులు చెప్పినా, వికటాట్టహాసంగా నవ్వినా ప్రేక్షకులు పరవశించిపోయారు. దుష్ట పాత్రల్లో లీనమైనప్పుడు హీరోయిన్లు భయపడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. డూప్ లేకుండానే నటించేవారు రాజనాల. శ్రీకృష్ణార్జున యుద్ధం చిత్రంలో ఆంజనేయ వేషం వేసిన రోజులలో ఆయన నేల మీదే పడుకొని నిద్రపోయారట. కంసుడు, జరాసంధుడు, దుర్యోధనుడు, మాయల ఫకీరు, దొంగల నాయకుడు లాంటి ప్రతి నాయకుల పాత్రల్లో ఆయన అమోఘంగా నటించారు. 'మాయ ద మెగ్నిఫ్మెంట్' ఆయన నటించిన హాలీవుడ్ చిత్రం. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లోని చిత్రాల్లో ఆయన నటన అద్భుతం.. అద్వితీయం!

**(జనవరి 3.. మహానటుడు రాజనాల జయంతి)**

**చల్లా చంద్రశేఖర్‌రెడ్డి**
సెల్. 94409 28666



---

## టూకీగా...



### కోవూరులో.. మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి

కోవూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో డిసెంబరు 31న మాజీప్రధాని వాజ్‌పేయి శతజయంతిని నిర్వహించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు వినయ్ నారాయణ, నాయకులు పోలిశెట్టి వెంకటసుబ్బారావు, కాసా శ్రీనివాసులు, ఆలూరి నాగవేణి, సుభాష్ పాల్గొన్నారు.

### ఏఎస్‌పేటలో..సంక్రాంతి ముగ్గుల పోటీలు

మండల కేంద్రమైన అనుమసముద్రంపేటలోని ఠాగూర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో డిసెంబరు 31న ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించగా, వందమందికిపైగా విద్యార్థినులు పాల్గొన్నారు. విజేతలకి మండల విద్యాశాఖ అధికారిణి ఎం.జ్యోతి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ కె.దొరస్వామిరెడ్డి, కరెస్పాండెంట్ రమణారెడ్డి పర్యవేక్షించారు.

### మనుబోలు వద్ద రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న 85 బస్తాల రేషన్‌బియ్యాన్ని డిసెంబరు 31న మనుబోలు హైవే వద్ద విజిలెన్స్ సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. శ్రీకాళహస్తి నుంచి వాహనంలో ఆ బియ్యాన్ని తరలిస్తున్నారని, ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్‌చేసి, దాని యజమాని, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేశామన్నారు.

### కోడెలమిట్టలో కోడిపందెంరాయుళ్ళ అరెస్ట్

ముత్తుకూరు మండలంలోని కోడెలమిట్ట గ్రామంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు ఇటీవల దాడిచేసి, కోడిపందేలాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి ఏడు బైక్‌లు, 6వేల రూపాయలతో పాటు, రెండు కోళ్ళను కూడా స్వాధీనం చేసుకున్నారు. ముత్తుకూరు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిపై కేసులు నమోదు చేశారు.

### గండవరం సచివాలయం తనిఖీ

కొడవలూరు మండలం గండవరం గ్రామంలోని సచివాలయాన్ని ఇటీవల డిప్యూటి ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదని ఆయన సిబ్బందికి సూచించారు.

# వీఆర్ హైస్కూల్ తరహాలోనే..మరో 15 స్కూళ్ళు!

**• మంత్రి నారాయణ వెల్లడి**

నెల్లూరు వీఆర్ హైస్కూల్ తరహాలోనే నగరంలో మరో 15 పాఠశాలలను సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పురపాలకమంత్రి డా.పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన వీఆర్ హైస్కూల్‌ని సందర్శించి, మెరుగైన విద్యాబోధనపై ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ చూపిన 15 మంది విద్యార్థులకు బహుమతులందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదపిల్లలకు నాణ్యమైన విద్యనందించాలన్నదే తన లక్ష్యమన్నారు. మన్సూర్‌నగర్‌లో ఉన్న అయిదెకరాల వక్ఫ్ బోర్డ్ స్థలంలో అన్ని హంగులతో త్వరలోనే పాఠశాలను నెలకొల్పుతామన్నారు. నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వారిలో 1500 మంది ఫౌండేషన్ కోర్సుపై ఆసక్తి చూపారని, వారందరికీ తాము విద్యాసామగ్రిని ఉచితంగా అందిస్తామని తెలిపారు. నగరంలో పాఠశాలల ఆధునీకరణకు ముందుకొచ్చిన దాతలకు మంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.



విద్యార్థినికి బహుమతినందజేస్తున్న మంత్రి నారాయణ







15వ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"
శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు
(మైపాడు వాస్తవ్యులు)
స్వర్గస్తులై తేది 05-01-2026 నాటికి
15 సంవత్సరాలు నిండనున్న సందర్భంగా
ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ - భార్య

కుమారులు - కోడళ్ళు
డాక్టర్ ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి - డాక్టర్ శాంతి
ఎన్.వినోద్‌రెడ్డి - షాలిని

కుమార్తెలు - అల్లుళ్ళు
జి.సుప్రియ - జి.విజయసింహారెడ్డి
ఎన్.పద్మప్రియ - ఎన్.చంద్రారెడ్డి

మనుమలు, మనుమరాండ్రు
జి.అభిషేక్‌రెడ్డి, వైష్ణవి
జి.అనుదీప్, భావిక, రాహిల్, రుషిల్ సాకేత్,
విషాల్, మేఘన, హర్ష, సంజన, వినూష

మునిమనుమరాలు - అమైర, ఆరియ

CRM IT Customer Success Partner | Fortune Primero | Fortune Summit business park NR Towers, BANGALORE.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com